ప్రజాశక్తి

Vol. 6, no. 9

(Feb. 28, 1945)

బెజవాడ, 1945

Record no. 683

Prajāśakti

Vol. 6, no. 9

(Feb. 28, 1945)

Bejavāḍa, 1945

Record no. 683

Reqd. No M. 4486 0-2-0

ప్రజాశక్తి

సంపుటి 6 బుధవారం 28-2-45 సంచిక 9

ప్రపంచ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు

మొన్న ఫిబ్రవరి 6 వ్వతేదీని లండన్‌లో ప్రపంచ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు సమావేశమైంది. ఇంచుమించు ప్రపంచ కార్మికవర్గానికి యిది ప్రాతినిధ్యం వహించింది. వివిధదేశాల ట్రేడ్‌యూనియన్ పోరాటాలలో కాకలుతీరిన నాయకులంతా ఇందులో పాల్గొన్నారు. "ప్రపంచ ట్రేడ్‌యూనియన్ ఫెడరేషన్" అనే ఒక కొత్తసంస్థను స్థాపించుటకు యీ మహాసభ నిర్ణయించింది. యుద్ధానంతరం అన్నిదేశాలలోను ప్రజాస్వామ్య సూత్రాల ఆధారంమీద ప్రపంచశాంతి స్థాపించబడాలని తీర్మానించింది. వెనుకబడ్డ వలసదేశాలను దోచుకొని బ్రతికే పాడువిధానం అంతరించాలని ఎలుగెత్తి చాటింది. అన్ని పరాధీనదేశాలలోను స్వపరిపాలనాపద్ధతి ఏర్పడాలని ప్రకటించింది.

లండన్‌లోజరిగిన ప్రపంచ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు ఒక చరిత్రాత్మకమైన సమావేశం.

పెట్టుబడిదారీ విధానమనే సంకెళ్లనుంచి విముక్తిపొందిన సోవియట్‌కార్మికవర్గం మొట్టమొదటిసారి బ్రిటన్, అమెరికా మొదలైన పెట్టుదారీదేశాల కార్మికోద్యమాలతో చేతులు కలిపింది. మొదటినుంచీ బ్రిటిష్‌ట్రేడ్‌యూనియస్ కాంగ్రెసు యొక్కనాయకులు సామ్రాజ్యవాదుల పాలసీని బలపరుస్తూ, అభివృద్ధినిరోధక మార్గం చేపట్టారు. అందువల్ల, ప్రపంచ కార్మికవర్గంలో ఎక్కువ ప్రాధాన్యత కలిగిన బ్రిటిష్ ట్రేడ్‌యూనియన్ ఉద్యమం సోవియట్ కార్మికవర్గంయొక్క సంస్థలతో దగ్గరసంబంధం పెట్టుకొనే అవకాశాలు ఇంతవరకు లేకపోయాయి. ఎంతసేపూ కమ్యూనిజాన్ని దుమ్మెత్తిపోయడం, సోవియట్ రష్యామీద విషప్రచారం చేయడం - ఇదీ బ్రిటిష్ ట్రేడ్‌యూనియస్ పెత్తందార్ల పోకడ. భారత దేశస్వాతంత్ర్యాన్ని మొదటినుంచీ అడ్డుతగులుతూన్న ప్రబుద్ధులుకూడా వీరే!

కాని, సోవియట్ సైన్యం, సోవియట్ కార్మికులు అద్భుతమైన ధైర్యసాహసాలతో హిట్లరు మూకల్ని చీల్చి చెండాడుతూ, అన్ని దేశాలస్వాతంత్ర్యాన్ని రక్షించడంలో ప్రధానమైన పాత్రవహిస్తున్నారు. తత్ఫలితంగా, వివిధదేశాల కార్మికవర్గం మధ్య సామ్రాజ్యవాదులు, వారి గులాములు నిర్మించినగోడలు ఒకటి తరవాత ఒకటి కూలిపోతున్నాయి. సోవియట్ కార్మికులమధ్య, యితరదేశాల కార్మికవర్గం మధ్య, పూర్తిమైన సహకారం ఏర్పడింది. అందువల్ల, యీరోజున ప్రపంచ ట్రేడ్‌యూనియన్ ఉద్యమంయొక్క స్వభావం పూర్తిగా మారిపోయింది.

ఇందుకు తార్కాణం సోవియట్, బ్రిటిష్, అమెరికన్, ఫ్రెంచి, చైనీస్ కార్మిక సంస్థలకు ప్రాతినిధ్యం ఉన్న "ప్రపంచ ట్రేడ్‌యూనియన్ ఫెడరేషన్"ను నిర్మించ పూనుకోవడమే. ఈ నిర్ణయంవల్ల సామ్రాజ్యవాదులు, ఫాసిస్టులు, అభివృద్ధినిరోధకులైన ట్రేడ్‌యూనియన్ పెత్తందార్లు ఇంతవరకూ అవలంబించిన సోవియట్ వ్యతిరేకపంథా దెబ్బతింది. సోవియట్ కార్మికోద్యమంమీద చేసిన విషప్రచారం పనికిరాకుండాపోయింది.

ఈ కొత్తసంస్థ ఏర్పడకుండా విరోధించడానికి మహాసభలో బ్రిటిష్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ కార్యదర్శి, సర్‌వాల్టర్ సిట్రిన్, తీవ్రంగాపోరాడాడు. భారత స్వాతంత్ర్యాన్ని, కమ్యూనిస్టు ఉద్యమాన్ని, సోవియట్ యూనియన్‌నీ, వ్యతిరేకించిన మహానుభావుడు యీ సర్‌వాల్టర్ సిట్రినే! ఇట్టి బ్రిటిష్ ట్రేడ్‌యూనియన్ నాయకుల దవ సహాయంతో పనిచేస్తూన్న ఆంస్టర్‌డాం అంతర్జాతీయ కార్మిక సంస్థనే యికముందుకూడా బలపరచవలసిందని యితడు మహాసభలో ప్రతిపాదించాడు.

ఈ ఆంస్టర్‌డాం సంస్థయొక్క చరిత్ర ఎలాంటిది? మొదటినుంచీ వలసదేశాల స్వాతంత్ర్య సమరాలకు ద్రోహంచేసిన సంస్థ ఇదే! గత 20 సంవత్సరాలనుంచి కమ్యూనిజానికీ, సోవియట్ యూనియన్‌కీ, వ్యతిరేకంగా ఎడతెగని ప్రచారం చేసిన కూటమి ఇదే! వివిధ దేశాలలో పెట్టుబడిదారీ వర్గానికి వ్యతిరేకంగా సాగిన కార్మిక పోరాటాలను భగ్నమొనర్చిన హేమాహేమీలు ఇందులోనే వున్నారు! చివరకు, ఫాసిజాన్ని నాశనం చేయుటకు వివిధ దేశాలలో కార్మికవర్గం ప్రారంభించిన ఉద్యమాల్ని చిందరవందర చేసిన బుద్ధిమంతులుకూడా యిందులోనే ఉన్నారు! ఇట్టి చరిత్రతో విరాజిల్లే ఆంస్టర్‌డాం సంస్థను సర్ వాల్టర్ సిట్రిన్ బలపరచడంలో ఆశ్చర్యం ఏముంది?

ఇంతటితో ఆగలేదు సిట్రిన్. ఇండియాప్రభుత్వం దగ్గర ధన సహాయం పొంది, కాంగ్రెసునాయకులు ఫాసిస్టులంటూ నీచంగా ప్రచారం చేసే రాయిస్టు కార్మికసంస్థ ప్రతినిధులకు సర్‌వాల్టర్ సిట్రిన్ ఈ మహాసభలో స్థానం యిచ్చాడు.

అయితే, ప్రపంచ ట్రేడుయూనియన్ కాంగ్రెసు సమావేశంలో యీ దుర్నీతిపరునికి సర్వత్రపరాజయమే సంభవించింది. ఇందుకు కారణం ఏమిటి? సిట్రిన్ ముఠాకు మహాసభలో బలం బహుస్వల్పం. అమెరికాలో బ్రహ్మాండమైన కార్మికోద్యమాన్ని నిర్మించి నడుపుతూన్న సి. ఐ. ఓ. (కాంగ్రెస్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఆర్గనైజేషన్స్) ప్రతినిధులంతా యితన్ని వ్యతిరేకించారు. సోవియట్ ప్రతినిధులు, భారతీయ ప్రతినిధులు(డాంగే, ఫెర్నికర్, ప్రమాణిక్‌గారలు), ఫ్రెంచి ప్రతినిధులు సిట్రిన్ ప్రభృతుల పాడు ధోరణికి ఎలా తల ఒగ్గుతారు? వీరంతా ప్రపంచ కార్మికోద్యమంయొక్క నూతన స్వాతంత్ర్యభావోదయాన్ని సూచించే ఉత్తమ పురుషులు. వీరా, కార్మికవర్గ శ్రేయస్సుకీ, మానవ స్వాతంత్ర్యానికీ, ప్రజాస్వామ్య పరిపాలనకీ, బద్ధశత్రువుగావున్న ఆంస్టర్‌డాం సంస్థను బలపరచేవారు?

దీనిస్థానే "ప్రపంచ ట్రేడ్‌యూనియన్ ఫెడరేషన్" స్థాపించాలనే తీర్మానం మహాసభలో ఆమోదింపబడ్డంవల్ల, ప్రపంచమందలి అన్ని దేశాలలోను స్వాతంత్ర్యస్థాపనకు బలీయమైన ఒక అంతర్జాతీయ ప్రజాఐక్యత ఏర్పడే అవకాశం కలిగింది. హిట్లరు పతనం కనుచూపుమేరలో ఉంది. నూతన ప్రపంచం ఆవిర్భవించబోతూంది. దాని స్వరూపం ఎలా వుంటుందో నిర్ణయించేది ప్రపంచ కార్మికవర్గం. విదేశాలపై దురాక్రమణచేసి, వలసదేశాలను తమ గుప్పెట్లో ఉంచుకుందామని ఉవ్విళ్లూరే సామ్రాజ్యవాదుల ఆశలు క్రియారూపం దాల్చకుండా చేయగల శక్తి ప్రపంచకార్మిక వర్గానికే ఉంది.

ఈకొత్త ప్రపంచ ట్రేడ్‌యూనియన్‌సంస్థలో బ్రహ్మాండమైన సోవియట్ ట్రేడ్‌యూనియన్ ఉద్యమం, బ్రిటిష్ - అమెరికన్ ట్రేడ్‌యూనియస్ ఉద్యమాలు, ఫ్రెంచి ట్రేడ్‌యూనియన్ ఉద్యమం, భారతట్రేడ్‌యూనియన్ ఉద్యమం, భాగాలుగా ఉంటాయి. ఈదేశాల కార్మికవర్గం అనేక పోరాటాలలో అగ్నిపరీక్షకు నిలిచింది. నిర్బంధవిధానాన్ని ఎదుర్కొని, అనుభవం సంపాదించింది. ఇలాంటి కార్మికవర్గం యొక్క అండ యీనాడు ప్రపంచప్రజలకుంది. యుద్ధానంతరం జరుగబోయే శాంతి సమావేశంలో అన్నిదేశాల ప్రజలు ప్రజాస్వామ్యసూత్రాల ఆధారంపై స్వేచ్ఛా ప్రపంచాన్ని నిర్మించుకోడానికి చేసే ప్రతి ప్రయత్నానికి యీ కొత్త ట్రేడ్‌యూనియన్ సంస్థ చేయూతనిస్తుంది. ప్రపంచమంతటా ప్రజారాజ్యాలేర్పడ్డానికి యిదొక గొప్ప సాధనం. అన్ని వలసదేశాలకు సంపూర్ణ స్వాతంత్ర్యం యివ్వాలనీ, యుద్ధానంతర ప్రపంచంలో ప్రజాస్వామ్యసూత్రాల ప్రకారం శాంతిని స్థాపించాలనీ, అప్పుడే యీసమావేశం తీర్మానం గావించింది. ఈతీర్మానం క్రియారూపంలో అమలుజరిగేటట్లు చూడ్డానికి కాకలుతీరిన వీరాధివీరులున్నారు. ఫాసిజం అనే పెనుభూతంతో ప్రచండయుద్ధాలొనరించి, తమతమ దేశాల స్వతంత్ర్యాన్ని రక్షించుకొనే యోధానయోధులున్నారు. సర్ వాల్టర్ సిట్రిన్‌వంటి ద్రోహులుపలె, ఒక నిమిషంలో వాగ్దానాలుచేసి మరుచటి నిమిషంలో భంగమొనర్చేవారు కారు వీరు.

కాబట్టి, కొత్తగా యేర్పడ్డ ఈ ట్రేడ్‌యూనియన్ ఫెడరేషన్ వివిధదేశాల మధ్య సమానత్వం కొరకు, అన్ని దేశాల సంపూర్ణస్వాతంత్ర్యంకొరకు, పోరాడి తీరుతుంది. తాను చేసిన నిర్ణయాలు అమలుజరిగేటట్లు చూస్తుంది. యాల్టా (క్రైమియా), టెహరాన్‌లలో జరిగిన మిత్రరాజ్య ప్రతినిధుల సమావేశ నిర్ణయాలు, అట్లాంటిక్ ప్రణాళిక వంటి మిత్రరాజ్య ప్రకటనలు, అక్షరాల అమలు జరిగేటట్లు చూస్తుంది. ప్రపంచ కార్మికవర్గం ఐక్యకంఠంతో ప్రకటించిన వాంఛను ఈరోజున ఏ ప్రభుత్వమూ తృణీకరించలేదు. అట్టిశక్తి ఏపాలకవర్గానికీ ఈరోజున లేదు.

ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రపంచప్రజలు, కార్మికవర్గం, యిన్నాళ్ళనుంచీ సాగిస్తూ వచ్చిన అద్భుత పోరాటాల పర్యవసానమే, యీ కొత్త "ప్రపంచ ట్రేడ్‌యూనియన్ ఫెడరేషన్". ఈ ఫాసిస్టు వ్యతిరేక మహాసమరంలో వివిధ దేశాల ప్రజలు అపూర్వ త్యాగాలొనర్చి సాధించిన సంఘీభావానికి యీ నూతన సంస్థ శాశ్వతత్వం చేకూరుస్తుంది. సిట్రిన్‌వంటి అప్రాచ్యులు ఇంకాకార్మికోద్యమంలో ఉన్నప్పటికీ, వాళ్ళకాలం మూడింది. ఇక వారు మాయనాటకాలు ఆడలేరు.

కొత్తగా మరొక ప్రపంచ ట్రేడ్‌యూనియన్ సంస్థను స్థాపించుటకై జరిగిన యీ నిర్ణయంపట్ల ప్రతి భారతస్వాతంత్ర్యవాది తన అనుకూలతను ప్రకటించవలసియుంది. ఎందువల్లనంటే, ప్రపంచమందలి అన్ని దేశాల (ఇండియా, చైనా మొదలైనవాటితో సహా) స్వాతంత్ర్యసిద్ధికి యీ సంస్థ, కార్మికవర్గ శక్తుల్ని సంఘటిత మొనర్చుతుంది. వివిధ దేశాల కార్మికులమధ్య, ముఖ్యంగా బ్రిటన్ - భారతదేశాల మధ్య చీలికలుపెట్టి, మనదేశానికి స్వాతంత్ర్యం ఈయకుండా భీష్మించుకు కూచున్న సామ్రాజ్యవాదుల కిది పెద్ద పరాజయమని మనం తెలుసుకోవాలి. మన జాతీయోద్యమానికి ఈ కొత్తసంస్థ బలమైన సహాయం ఇస్తుంది. ఆ సహాయంతో మనం ఫాసిజాన్నే కాకుండా, సామ్రాజ్యవాద దురహంకారుల్ని కూడా ఓడించగలుగుతాం.

— "పీపుల్సువార్" సంపాదకీయం.

(25—2—45)

అమెరికన్ల సానుభూతి

అమెరికన్ ట్రేడ్‌యూనియన్ ఉద్యమానికి నాయకుడైన సిడ్నీ హిల్మన్ పత్రికా విలేఖరులతో యిలా చెప్పాడు:

"అన్ని దేశాలకు సంపూర్ణ స్వపరిపాలనా హక్కు సిద్ధించడానికే ఈ ప్రపంచ ట్రేడుయూనియన్ కాంగ్రెసు అనేక నిర్ణయాలు చేసింది. భారతదేశ స్వాతంత్ర్యంకూడా అందులో యిమిడిఉంది. మా అమెరికన్ ప్రజలమంతా భారతజాతీయవాంఛను బలపరుస్తున్నారు. యుద్ధం త్వరలోవిజయవంతంగా ముగియడం ఎలాగు? అనే సమస్యమీదనే అమెరికన్ల దృష్టి యీ రోజున ఎక్కువగా కేంద్రీకరించబడియుంది. భారతదేశంపట్ల వారు అవసరమైనంత 'దీక్ష'తో పనిచేయలేకున్నారు. యుద్ధం త్వరలో ముగియడానికి భారతీయులు హృదయపూర్వకంగా యుద్ధకృషిలో పాల్గొనేటందుకుచేసే ప్రతిప్రయత్నాన్ని మేముబలపరుస్తాం. ఫిలిప్పైన్స్ దీవులకు మా అమెరికా ప్రభుత్వం ఎలా స్వాతంత్ర్యం గ్యారంటీ చేసిందో, అలాగే భారతదేశం పట్లకూడా బ్రిటిష్ పాలకవర్గం ప్రవర్తించాలని ప్రతి అమెరికన్ పౌరుడు కోరుతున్నాడు."

ఎవరిది జాతీయత?

[రాష్ట్రకాంగ్రెసు అసెంబ్లీ పెద్దలు పరిశ్రమాభివృద్ధి పనికిరాదంటూ చేసే ప్రచారాన్ని ఆక్షేపించుతూ 'ఆంధ్రాభిమాని' వ్రాసిన యీ లేఖను ప్రకటించుతున్నాము. లేఖలో 'ఆంధ్రాభిమాని' నేడు ఆంధ్ర జాతీయవికాసానికి పరిశ్రమాభివృద్ధి అవుసరమని వివరించారు. కాశేశ్వరరావు, కల్లూరి సుబ్బారావు, రంగాగార్లు ఆంధ్ర జాతీయాభ్యుదయానికే అపచారం చేస్తున్నారని స్పష్టపరచారు. ఈ సందర్భంలో మేము ఒక సంగతి చెప్పవలసివుంది. వెనుకబడిన ప్రాంతాలలోను, యుద్ధంవల్లసరుకుదొరకనపుడూ తాత్కాలికంగా రాట్నం వగైరా చేతిపరిశ్రమలు ఉపకరించుతాయి. కాని చేతిపరిశ్రమలతో సంతృప్తిపడి కూర్చుందామంటే నిజంగా 'ఆంధ్రాభిమాని' అన్నట్లుగా ఆంధ్రాభ్యుదయానికే అపచారం చేయడమవుతుంది.

అంతేకాదు. సైన్సు, యంత్రపరిశ్రమలు ప్రపంచమంతటా అభివృద్ధి చెందినపుడే విశ్వమానవ కల్యాణం సాధ్యం అవుతుంది. అన్ని జాతుల, దేశాల ప్రజల సంపత్తి వృద్ధిచెందుతుంది.

ఇప్పటివలే కొన్ని దేశాలు పారిశ్రామికంగా అభివృద్ధిచెంది, కొన్ని వెనుకబడి ఉంటే, మానవాభ్యుదయమే కుంటుబడుతుంది. ఇపుడుచూడండి: బ్రిటను, అమెరికా, జర్మనీ, జపానులవంటి సామ్రాజ్యవాద దేశాలు వెనుకబడిన భారతదేశాన్ని, ఆసియా, ఆఫ్రికా దేశాలను బానిసత్వంలోవుంచి దోచుకుంటున్నాయి. వీటిని పంచుకోవడంలో తగవులువచ్చి, ప్రపంచ యుద్ధాలకు దారితీస్తున్నాయి. హెచ్చుతగ్గులు లేకుండా అన్ని దేశాలలో పరిశ్రమలు పెంపొందితే ఈ దోపిడీకి అవకాశమే వుండదు. అందుకనే, బ్రిటిషు సామ్రాజ్యవాదులు భారత పరిశ్రమాభివృద్ధికి ఆటంకాలు పెడుతున్నారు. కాంగ్రెసు మహాసభ నెహూరి ఆధిపత్యంక్రింద పరిశ్రమాభివృద్ధికి ఒక ప్లానింగ్ కమిటీని ఏర్పరచిన సంగతి అందరూ ఎరిగిన సంగతే.

కాబట్టి పరిశ్రమాభివృద్ధి అక్కరలేదనే రంగా ప్రభృతుల వాదన ఆంధ్రాభ్యుదయానికి అపచారం చేయడమే గాకుండా, భారత స్వాతంత్ర్యోద్యమానికి, మానవాభ్యుదయానికి కూడా వ్యతిరేకం.

పెట్టుబడిదారుల యాజమాన్యం క్రింద పరిశ్రమలుంటే స్వంతలాభంకోసం ప్రజలను దోచుకుంటారనేమాట నిజమే. అంతమాత్రాన యంత్రాలను, సైన్సును నిందించి లాభంలేదు. లేక పరిశ్రమలు అక్కరలేవని మడిగట్టుకొని కూర్చున్నా లాభంలేదు. ఆధునికప్రపంచంలో పారిశ్రామికంగా మన దేశం వృద్ధిచెందకపోతే, ఆర్థికంగా మరొకరికి దానిసత్వం తప్పదు.

అందుచే పరిశ్రమలను నిర్మించాలి. వృద్ధిచేయాలి. కాని అవి వ్యక్తుల లాభంకోసంగాక జాతిఅంతటి ఉపయోగం నిమిత్తం పనిచేయాలి. అపుడు ప్రజలను దోచుకోడమనేది వుండదు. జాతీయాభ్యుదయానికి, మానవాభ్యుదయానికి అవితోడ్పడుతాయి.]

★

ప్రజాశక్తి సంపాదకులకు

అయ్యా!

నేను ఫిబ్రవరి 21వ తేదీన రామ్మోహన్ హాలులో జరిగిన సభకు వెళ్ళాను. దానిలో ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు అసెంబ్లీనాయకులు పలువురుపన్యసించారు. వారి మాటలు వింటూంటే నాకు కొన్ని సందేహాలు కలిగాయి. తమరు సమాధానం యిస్తారనేఆశతో యీ లేఖను వ్రాస్తున్నాను.

మన ఆంధ్రదేశం పరిశ్రమలలో వెనుకపడివుందనీ, విద్యాభివృద్ధి తగినంతగా లేదనీ నేనెపుడూ విచారించుతుంటాను. ఉదాహరణకు చూడండి: రాయలసీమ జిల్లాలలోను, తెలంగాణాలోను, యితర జిల్లాలలో మెరక ప్రాంతాలలోను, మన రైతులు ప్రత్తిపండించుతున్నారు. కాని యీవ్రత్తిని నూలుగాను, బట్టగాను తయారుచేసే పరిశ్రమలు మన ఆంధ్రదేశంలో లేవు. అందుచే మనరైతులు తమ పంటను అమ్ముకోడానికి బొంబాయి, అహమ్మదాబాద్ మార్కెట్టుపైన, విదేశాలపైన ఆధారపడవలసి వస్తూంది. ప్రస్తుతం బట్టల మిల్లులు విపరీతంగా లాభాలు పొందుతున్నాయి. కాని ప్రత్తిపండించే మనరైతులు తమ సరుకు విలువలగాక చాలా అవస్థపడుతున్నారు.

రెండోవైపున ఆంధ్రప్రజలు విపరీత ధరలకు బట్టలు కొనలేక బాధపడుతున్నారు. బొంబాయి, అహమ్మదాబాద్ మిల్లుబట్టల దిగుమతిపై ఆధారపడవలసి వస్తూంది.

ఇందువల్ల రెండువిధాలుగా ఆంధ్రప్రజలం నష్టపడుతున్నాము. మనరైతులు పండించే ప్రత్తికి సరియైన ధర రావటంలేదు. ప్రస్తుతం యుద్ధపరిస్థితులవల్ల అసలు సరుకే విలువలకావడంలేదు. రెండోవైపున మన ప్రజలకు న్యాయమైన ఖరీదుకు బట్టలు దొరకడంలేదు. బీదసాదలకు బట్టకరువై పోయింది. ఈవిధంగా బట్టలమిల్లుల యజమానులచేత మన ప్రజలు రెండువిధాలుగా దోచుకోబడుతున్నారు.

అందుచే, ఆంధ్రభూమి సంపదలు వృద్ధిపొందాలంటేనూ, మెరకప్రాంతాల ప్రత్తిపండించే రైతుల ఇక్కట్టులు తొలగాలంటేనూ, మన తెలుగుదేశంలోనే, ముఖ్యంగా ప్రత్తిపండించే ప్రాంతాలలోనే, బట్టల పరిశ్రమలు స్థాపించాలని కోరుతాను.

ఇలాగే, మన మెరక భూములలో వేరుశెనగపంట విస్తారంగా పండుతోంది. ఇదంతా ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతోంది. మానెగాను, దుంపనెయ్యి (వెజిటబుల్ ఘీ) గాను మరల హెచ్చుఖరీదులతో దిగుమతి అవుతోంది. అందుచే నూనె పరిశ్రమలుకూడ వేరుశెనగ పండే ప్రాంతాలలో నిర్మించితే, మన రైతుకు సరియైన ఖరీదు గిడుతుంది. సక్రమ ఖరీదుకు నూనె ప్రజలకు అందుతుంది. ఇలాగ పరిశ్రమల నిర్మాణంవల్ల మన తెలుగుభూమి సౌభాగ్యం వృద్ధిపొందుతుందని నేను భావించుతాను. ఆంధ్రజాతీయాభివృద్ధి పెంపొందుతుందని నేను ఆశించుతాను.

కాని మొన్నటి రామ్మోహన్ లైబ్రరీ సభలో ఆంధ్రకాంగ్రెసు అసెంబ్లీ పెద్దలు యిందుకు పూర్తిగా విరుద్ధంగా మాట్లాడారు. అయ్యదేవర కాశేశ్వరరావుగారు మనకు యంత్ర పరిశ్రమలు అక్కరలేదన్నారు. గ్రామ పరిశ్రమలపైనే మనం ఆధారపడాలన్నారు. కల్లూరి సుబ్బారావుగారు "అసలు పరిశ్రమలే దేశానికి ముప్పుతెస్తున్నాయి. ఈ పరిశ్రమలు పూర్తిగాపోయి గ్రామ పరిశ్రమలు మాత్రమే ఉండాలి. అదే మన ప్రాచీన నాగరికత" అన్నారు. సుబ్బారావుగారు యింకా "సినిమాలు వగైరా సనేమి మనకు వద్ద"న్నారు. ఇదంతా వింటూంటే నాకు మన పెద్దలు తాము సృష్టించుకొన్న 'త్రిశంకుస్వర్గంలో' కలలుగంటున్నారా అని పించింది.

నేను 1920 నుంచి కాంగ్రెసుఅభిమానిని. స్వాతంత్ర్యోద్యమాన్ని బలపరుస్తూ, భారత రాజకీయాల గమనాన్ని పరిశీలించుతున్న వారిలో ఒకడను. దానితోపాటు నాకు ఆంధ్ర జాతీయాభిమానం కూడవుంది. ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కావాలంటాను. తెలుగు భూమిలో వ్యవసాయం, పరిశ్రమలు అభివృద్ధి చెంది, మన ప్రజలు సకలసంపదలలో తులతూగాలని ఆశించుతాను. ప్రజాసామాన్యంలో విద్యా, విజ్ఞానాలు అభివృద్ధి చెందాలని కోరుతాను. తెలుగుభాష, సాహిత్యం, కళలు, సంస్కృతి పెంపొందాలని ఉవ్విళ్లూరుతాను. అపుడే మన ఆంధ్రజాతి సర్వతోముఖంగా వికసిల్లుతుందని నానమ్మకం.

కాని మన ఆంధ్రకాంగ్రెసు పెద్దల చిలుక పలుకులు వింటూంటే, ఆంధ్రాభిమానులనోటి వెంటరావలసినపలుకులని కన్పించుతోంది. 1920 నుంచి గాంధీగారు పెద్దపరిశ్రమలు పనికిరావంటున్నారు. రాట్నంవంటి చేతిపరిశ్రమలేఆదర్శమని వాదించుతున్నారు. గత 25 సంవత్సరాల నుంచి ఆంధ్రకాంగ్రెసు నాయకులుకూడా యీ పలుకులను వల్లించుతూనే వున్నారు. ఇన్ని యేండ్లు గడిచాకనైనా ఒక్కసారి యీ పెద్దలు వెనక్కితిరిగి చూచుకోడంలేదు.

చూడండిమరి: ప్రత్తిపండించేమనరైతులు బొంబాయి, అహమ్మదాబాద్ మిల్లుయజమానులచే దోచుకోబడుతూనే వున్నారు. గాంధీగారు ఎంతప్రచారంచేసినా, రాట్నం పరిశ్రమల పోటీకి నిలబడలేదు. స్వాతంత్ర్యోద్యమ ఫలితంగా ప్రజలలో దేశభక్తి ప్రబలింది. స్వదేశీని వాడుతున్నారు. బట్టలమిల్లుయజమానులు లాభాలను గడించుకున్నారు. యుద్ధఫలితంగా వీరి లాభాలు విపరీతంగా పెరిగాయి: ఆంధ్రదేశంలో పండిన ప్రత్తి, వేరుశెనగ ఇతర ప్రాంతాలలోని పరిశ్రమలకు ఆహారంగా పోతూనేవుంది. వాళ్ళు లాభాలు గడించుతున్నారు. మనపెద్దలు మాత్రం కండ్లుమూసుకొని "మాకు పరిశ్రమలు వద్దు" అని చిలుక పలుకులు వల్లించుతూ వున్నారు. కాశేశ్వరరావుగారు యింకా మాటాడుతూ రవాణాసౌకర్యాలు అవసరం లేదన్నారు. "రైతులకు రోడ్లు అనవసరం. వాటివెంట విదేశ సరుకులు ఊళ్ళలో దిగుతాయ్" కనుక అక్కరలేదన్నారు. వేదకాలంనాటి నాగరికత కావాలన్నారు. పరిశ్రమలు నిర్మించుకొని విదేశదిగుమతుల అరికట్టాలి. గాని రోడ్డులే మాకువద్దనడం ఏమి పని? బ్రిటిషువారిమీద కోపముతో రోడ్ల నిర్మాణం వద్దంటామా? దారి సౌకర్యాలు లేని మనగ్రామాలకు రోడ్లనిర్మాణం ఎంతో అవుసరం గదా! ఇలాంటి వాదం ప్రజల మేలు కోరేవారు చేయవలసిందికాదు.

పారిశ్రామికంగా ఆంధ్రదేశం వెనుకబడివుండటంవల్ల మనప్రజలు ఎలా యిబ్బంది పడుతున్నారో చూడండి: ప్రజలందరికి వ్యవసాయ మొకటే మిగిలిన వృత్తి. దానిపై వత్తిడి ఎక్కువయి, నిరుద్యోగం పరిపాటి అయింది. రైతులకు పొట్టగడవటమే కష్టసాధ్యం అవుతోంది. ఈ వత్తిడి తగ్గించడానికి పరిశ్రమల నిర్మాణం అత్యవసరం. దీనిని యీపెద్దలు ఏమాత్రం గ్రహించడంలేదు.

ఆంధ్రదేశం విద్యలోను, పరిశ్రమలలోను వెనుకబడటంవల్ల ఏమి జరుగుతోందో చూడండి: మనకంటే పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన తమిళదేశం వారిదే ఉద్యోగాలలోను, పరిశ్రమలలోను పైచేయి అయింది. అదేవిధంగా మనకంటే పారిశ్రామికంగా అభివృద్ధిచెందిన గుజరాతీలు, మార్వాడీలు ఆంధ్రదేశమందలి పట్టణాలన్నిటిలోనూ, బట్టలు వగైరా వర్తకులుగాను, వడ్డీ వ్యాపారస్తులుగాను, వ్యాపించారు. 1930-34 ఆర్థిక దుస్థితి రోజులలో ఆంధ్ర రైతాంగంయొక్క ఆస్తులు వీరికెలా దఖలుపడ్డాయో అందరూ ఎరిగిన సంగతే. ఇల్లాగే ఇతరప్రాంతాల నుంచి పెట్టుబడిదారులు యీ ప్రాంతానికి ఎగబడుతున్నారు. ఉదాహరణకు:- అసోసియేటెడ్ సిమెంట్‌వర్క్సు - బిర్లా కంపెనీవారు దాల్డా ఫ్యాక్టరీని నిర్మించడానికి ప్రయత్నించుతున్నారని వినికిడి. ఈ సందర్భంలో ఇంకో సంగతి జ్ఞాపకం చేయడం మంచిదనుకుంటాను. మంగళగిరిలో సిమెంటు ఫ్యాక్టరీని నిర్మించుతున్నప్పుడు ఆంధ్ర కాంగ్రెసు పెద్దలు దానికి ఆటంకాలు పెట్టారు. తాము భాగస్తులుగాఉన్న బెజవాడ సిమెంటు ఫ్యాక్టరీకి అది పోటీవస్తుందని వారి భయం. కాని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ మద్రాసు మంత్రివర్గంపై ఒత్తిడితెచ్చి, మంగళగిరి సిమెంటు ఫ్యాక్టరీకి అనుమతి యిప్పించింది. కాబట్టి మనకు పరిశ్రమలు వద్దంటే, యితరులు వచ్చి నిర్మించుతారు. లాభాలు పొందుతారు.

ఒక వైపున యితర పెట్టుబడిదారులు మన దేశంలోకివచ్చి లాభాలు గడించుతున్నారని పైన చూపించాను. రెండో వైపున చూడండి. మన ఆంధ్ర ప్రజలు నిరుద్యోగులై, తిండిలేక పొట్టచేతపట్టుకొని కూలీలుగా యితర ప్రాంతాలకు పోతున్నారు. మద్రాసులో రిక్షా కూలీలను గమనించండి: వారెవరు? హెచ్చుమంది తెలుగుదేశంలో సాగుచేయడానికి భూమిలేక వలసపోయిన బీద రైతులు. అల్లాగే బొంబాయి, షోలాపూర్ బట్టల పరిశ్రమలలో చూడండి: కలకత్తా జూట్ మిల్లులలో చూడండి: బర్మా కలప యంత్రాలలో, రంగూన్ నగరవీధులలో కష్టపడే కూలీలెవరు? తెలుగుప్రజలు. మనదేశంలో పనిదొరకక, పొట్టగడవక, యితరప్రాంతాలకు పోయారు. ఈ చిత్రాన్ని ఒక్కసారి దృష్టికి తెచ్చుకుంటే ఏ ఆంధ్రుడు 'మాకు పరిశ్రమలు' వద్దు అనగలడు?

—'ఆంధ్రాభిమాని'

సవరణ

అనంతపురం జిల్లా రైతుమహాసభ కొత్తచెరువులో జరుగుతుందని గత సంచికలో వేశాము. ఇది పొరపాటు. ఈ సభ బుక్కపట్నంలో జరుగుతుంది.

'అర్థంచేసికోలేకపోతేమానె నిందలనుమాత్రం సృష్టించవద్దు'

[సోవియట్ వ్యతిరేకప్రచారకులకు అమృతబజారు పత్రిక హితబోధ.

[ఈ వ్యాసం ఫిబ్రవరి 20 వ తేదీన ప్రచురింపబడిన "అమృతబజారు పత్రిక" సంపాదకీయానికి అనువాదం. ఆంధ్రదేశంలో కూడ సోవియట్ యూనియన్‌పై దుష్ప్రచారం చేసేవారున్నారు. కమ్యూనిస్టులపై కోపంవల్ల వారిదృష్టి మందగించి, స్పష్టంగా కన్పించే సత్యాలనుకూడ వారు గుర్తించలేకున్నారు "అమృతబజారు పత్రిక" కమ్యూనిస్టులదికాదు. దాదాపు 80 యేండ్లుగా ప్రజాసేవచేస్తున్న సుప్రసిద్ధ జాతీయపత్రిక. ఈ పత్రికాసంపాదకీయం మన అనుమానయ్యల సందేహాలను తొలగించి, సత్యాన్ని గుర్తించేలా చేస్తుందనే ఆశతో దానిని యిచట ప్రకటించుచున్నాము. సం.]

★

"యుద్ధం, శాంతి" సమస్యలను నాయకత్రయసమావేశంలో జరిగిన నిర్ణయాలపై రకరకాలుగా విమర్శలుబయలు దేరాయి. పాతప్రపంచం సుస్థిరంగా వుండాలనేది విమర్శనలన్నిటిలోనూ ఒకే కుటుంబ లక్షణం ద్యోతకమవుతోంది. ఏజాతివారైనా సరే, ఏ తెగకు చెందినాసరే, వారి జాతీయ దురహంకారం ఒకే అచ్చులో పోతపోసినట్లు కన్పించుతూంది. జోసఫ్ స్టాలిన్‌ను నిందించడంలో వీరందరూ ఏకం. కొందరు ప్రజాస్వామ్యం పేరుతో నిందించుతున్నారు. కొందరు మత స్వాతంత్ర్యం పేరుతో దుమ్మెత్తిపోస్తున్నారు. మరికొందరు సోవియట్‌యూనియన్ సామ్రాజ్యవాదాన్ని మరోరూపంలో పునరుద్ధరించుతూందని ఆక్షేపించుతున్నారు. అభివృద్ధి నిరోధకులు ఇలాంటి విమర్శనలు చేయడంలో ఆశ్చర్యంలేదు. కాని మనదేశంలో కూడా పత్రికలలోను, ఉపన్యాసాలలోనూ యీ నిందలను ఉద్రేకంతో వల్లించడం విచిత్రంగా కన్పించుతూంది. అర్థంలేని యీ సోవియట్ వ్యతిరేక దుష్ప్రచారం, కాకమ్మకబుర్లు వింటూంటే వెనుకటిసంగతులు జ్ఞాపకంవస్తాయి. యుద్ధంయొక్క మొదటిదశలలో ఈ పండితమ్మన్యులు బ్రిటిషురాజనీతిజ్ఞుల పన్నాగంలో సోవియట్ పడిపోయిందని చెప్పేవారు.

జర్మనీ, ఇటలీలకువ్యతిరేకంగా రష్యాసామ్రాజ్యవాదుల కూటమిలో చేరేలా క్రిప్స్ చేయగలిగాడని చెప్పేవారు. బ్రిటిషు ప్రభుత్వంపై పీడిత ప్రజలైన భారతీయులకువున్న ద్వేషంవల్ల యిలాంటి అనుమానాలు కలిగాయని సహించవచ్చు. వారివాదన యిలా వుండేది:- బ్రిటిషు సామ్రాజ్యవాదానికీ జర్మన్, ఇటలీ ఫాసిజానికీ, తేడా ఏమీలేదు. అవి ఒకదానితో మరొకటి పోరాడి అలసిపోతే భారతదేశానికీ, ప్రపంచానికి కూడ మంచిదనేవారు. కొందరు యింకా వితండ వాదన చేసేవారు. హిట్లరు జయించవమంటే, బ్రిటిష్‌సామ్రాజ్యం కూలిపోతుంది: మనదేశంలో శాంతి, అభ్యుదయం, సౌఖ్యం చేకూరే శకం వస్తుంది. అని వాగేవారు. సోవియట్ బ్రిటను పక్షాన చేరడంవల్ల భారతదేశ బానిసత్వం స్థిరపడుతుందని చెప్పేవారు. ఇపుడు అరకమైన వాదన ప్రచారంలో లేదు. మానవజాతి భవిష్యత్తును నిర్ణయించడంలో సోవియట్ వహించే పాత్రను గురించి వారు యిపుడు భీతివెల్లడించుతున్నారు.

క్రూరత్వం, నిరంకుశత్వం, డిక్టేటర్‌షిప్పు, జాతీయ దురహంకారం, సామ్రాజ్యవాదం- ఇవన్నీ కలపితే సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్స్ ఏర్పడ్డాయా, అన్నట్లుగా ఈ దుష్ప్రచారం సాగుతూంది. బ్రిటిషు టోరీలు సోవియన్ యూనియన్‌లో మతసహనం లేదని నిందించుతున్నారు. ప్రపంచంలో మత విశ్వాసంగల స్త్రీ పురుషులందరినీ సోవియట్ వ్యతిరేకులుగా చేయాలని వాళ్ళీప్రచారం చేస్తున్నారు. విశ్వమానవ కల్యాణానికి బ్రహ్మాండమైన ప్రయత్నం జరుగుతూంటే, సోవియట్ యూనియన్‌లో భూస్వాముల భూమిని లాక్కున్నారనీ, రక్తం ప్రవహింపచేశారనీ యీ ద్రోహులు నిందించుతున్నారు. ఈ పేరుతో అహింసావాదులను తమవైపు త్రిప్పుకోవాలని చూస్తున్నారు. ప్రజాస్వాతంత్ర్యం చూచి భీతితో దోపిడిగాండ్రు, దొంగ వ్యాపారస్తులు వేస్తున్న కేకలివి. టోరీలు అలా అనడాన్ని మనం అర్థం చేసికోవచ్చు. కాని విచిత్రమేమిటంటే, మన దేశంలోకూడ కొందరు ప్రమాదకరం, విద్రోహకరం అయిన ఈనినాదాలను చిలుకలవలే వల్లించుతున్నారు. ఆశ్చర్యం ఏమిటంటే, అమెరికా ధనస్వాములు, బ్రిటిషు సామ్రాజ్యవాదులు, చెప్పే మాటలు వీరికి తియ్యగా కన్పించుతున్నాయి. హిట్లరు నాశనమయిపోతున్నాడు. జపాన్‌కు కూడా అదేగతి పడుతుంది. ఇంక మిగిలితే బలమైన ప్రభుత్వాలు మూడు. మన పండితమ్మన్యులు రూజ్‌వెల్టును వరించుతున్నారు. చివరకు చర్చిలైనా మెరుగే నంటున్నారు. ఏమైనా సరే స్టాలిన్ మాత్రం సనేమి వీల్లేదంటున్నారు ఇదంతా చూస్తే ఎంతో శోచనీయంగా కన్పించుతున్నది. మూఢ విశ్వాసాలు, వర్గ విద్వేషం ఫలితంగా కలిగే యీ భీతివల్ల అనేక ప్రమాదాలున్నాయి.

వ్యతిరేకుల ప్రశ్నలు

సోవియట్ యూనియన్‌లో నిరంకుశ ప్రభుత్వం వుందా? స్టాలిన్ డిక్టేటరా? సోవియట్ కూడా సామ్రాజ్యవాద ప్రభుత్వమా? స్టాలిన్ సోషలిస్టు సామ్రాజ్యాన్ని నిర్మించుతున్నాడా? సోవియట్ యూనియన్ అంతర్జాతీయతవదలి, జాతీయతను అవలంబించిందా? స్టాలిన్ నేషనల్ సోషలిజానికి పునాదులు వేస్తున్నాడా? ఇవీ నేడు కొందరడిగే ప్రశ్నలు. సోవియట్ యూనియన్ సాధించిన విజయాలు చూచాక, స్టాలిన్ తన పాలసీని, కార్యక్రమాన్ని పదేపదే వివరించాక కూడా ఆలోచనాశక్తివున్న మనిషి అడగాలసిన ప్రశ్నలుకావివి. అయినప్పటికి యిలాంటి భ్రమలను తొలగించడానికి పై ప్రశ్నలకు సమాధానం యిస్తున్నాము.

సోవియట్ విధానం, జీవితం గురించి అధికార పూర్వకంగా చెప్పగలవారు స్టాలిన్ కంటే యింకెవరూలేరు. 1936 నవంబరు 25వ తేదీన జరిగిన 8వ సోవియట్ కాంగ్రెసులో స్టాలిన్ స్వయంగా ఒక రిపోర్టు యిచ్చాడు. దానిలో సోవియట్ రాజ్యాంగ విధానంలో ప్రవేశపెట్టిన మార్పులను స్టాలిన్ వివరించాడు. ప్రజాస్వామ్య ప్రభుత్వాలని పిలువబడుతున్న ఇతర రాజ్యాంగవిధానాలు పెట్టుబడిదారీ సమాజం మార్పు చెందకూడదనే సూత్రంపై ఆధారపడివున్నాయని తెలియజేశాడు. సోవియట్ రాజ్యాంగం అలాంటిదికాదు. దోపిడీవిధానాన్ని, దోపిడి చేసే వర్గాలను రద్దుచేశాక సోవియట్ రాజ్యాంగం నిర్మించబడింది. ఇతర దేశాలలో వలె సోవియట్ యూనియన్‌లో అధికసంఖ్యాకుల బీదతనం కొలదిమంది భోగాలు తొలగించబడ్డాయి. నిరుద్యోగం రద్దయింది. శక్తివున్న ప్రతిపౌరుడూ పనిచేయడం గౌరవంగానూ, కర్తవ్యంగానూ ఎంచుతాడు. ప్రతి పౌరునికి వృత్తికి గ్యారంటీవుంది. విద్యపొందడానికి, విశ్రాంతి అనుభవించడానికి, పౌరులకు హక్కువుంది. ఇలాంటి ప్రజాహక్కులే సోవియట్ రాజ్యాంగానికి మూలాధారం. అందుచే, సోవియట్ యూనియన్ సోషలిజాన్ని విడనాడిందనడం శుద్ధపొరపాటు. పెట్టుబడిదారీ దేశాలలో వర్గసంస్థలున్నాయి. ఆ దేశాలలోని ప్రజాస్వామ్యం బలవంతులగు కొలదిమంది ధనస్వాములకు మాత్రమే ఉపయోగింపబడుతూంది. కాని, సోవియట్ యూనియన్‌లో అలాకాదు. అచట కష్టజీవుల ప్రజాసామ్యంవుంది. ఫ్యాక్టరీలలోను, పొలాలలోను చెమటోడ్చి పనిచేసేవారికి, ప్రజలందరికీ ఉన్న ప్రజాస్వామ్యం అది. పెట్టుబడిదారీ దేశాలలో ప్రజాస్వామ్యంపేరుతో వర్గనిరంకుశత్వం అమలు జరుగుతోంది. సోవియట్ యూనియనులో సోషలిస్టు ప్రజాస్వామ్యం అమలుజరుగుతోంది. నేడుసోవియట్ యూనియన్‌లో కార్మిక నియంతృత్వంలేదు. ఏమంటే, కష్టజీవులైన ప్రజాసామాన్యాన్నిదోచుకునే వర్గాలున్నప్పుడే కార్మిక (కష్టజీవుల) నియంతృత్వం అవుసరమవుతుంది. నేడు సోవియట్ యూనియన్‌లో దోపిడీచేసే వర్గాలులేవు. కాబట్టి, సోవియట్‌లో ధనస్వాముల నిరంకుశత్వమూ లేదు; కార్మికవర్గ నియంతృత్వమూ లేదు: స్టాలిన్ ఇంకా యిలాచెప్పాడు: "వివిధ జాతులు, తెగలమధ్య సమానహక్కులు కలిగివుండటానికి వీలులేదు: తెల్లజాతుకులనల్లజాతులకు మధ్య పెద్ద అంతరముంది: యూరపు జాతులకు - ఆసియా జాతులకు మధ్య నిరంతర పోరాటం వుంది" అనే సంకుచిత దృష్టితో పెట్టుబడిదారీ రాజ్యాంగాలు నిర్మించబడ్డాయి. సోవియట్ యూనియన్ ఇలాకాదు: అది అంతర్జాతీయ దృష్టితో నిర్మించబడింది. దానిలో వివిధజాతుల సంస్కృతి, కళలు రక్షింపబడుతున్నాయి. వారిలో సోషలిస్టు చైతన్యం కలిగించబడుతూంది. సోవియట్ రాజ్యాంగంలో అన్నిజాతుల ప్రజలు తెగలు సమాన హోదాను అనుభవించుతున్నారు. వారి వెనుకటి చరిత్రలతో సంబంధంలేదు. పెద్దదా—చిన్నదా అనే తేడాలేదు. ఆర్థిక, సామాజిక, రాజకీయ, విజ్ఞాన రంగాలన్నిటిలోనూ అన్నిజాతులకు సమానహోదా యివ్వబడుతూంది. అందుచే, సోవియట్ యూనియన్‌లో రష్యన్ జాతీయ దురహంకారానికి తావులేదు. అచట జాతీయ దురహంకారం, స్థానిక దురభిమానాలు తొలగించబడి వివిధజాతుల సంస్కృతి, భాషలు, అభ్యుదయకరమైన సాంప్రదాయాలు పెంపొందడానికి సంపూర్ణ అవకాశం యివ్వబడుతూంది.

నిష్పాక్షిక రచయితలు

అయితే, కొందరు ఒకవాదన తేవచ్చు. స్టాలిన్ ఒక పక్షానికి చెందినవాడు కాబట్టి సోవియట్ విధానాన్ని అర్థం చేసికోడానికి అతనిమాటలు సహాయకారి కావని వాదించవచ్చు. ఇలాంటి వాదనను మేము అంగీకరించము. అయినప్పటికి యిలాంటి అనుమానయ్యలు, చొప్పకబుర్ల వారుఒకపనిచేయవచ్చు. రుజువర్తనులని ప్రఖ్యాతి చెందిన మధ్యవర్తుల రచనలను చదివి, సందేహాలు తీర్చుకోవచ్చు. 1936-1938 లో అమెరికా రాయబారిగా వున్న డేవిస్ "మిషన్ టు మాస్కో" అనే గ్రంథం రచించాడు. దీనిలో అమెరికా విదేశాంగశాఖకు వ్రాసిన లేఖలు వగైరా ప్రకటించబడ్డాయి. 1942 లో అది అచ్చుపడింది. దీనిని చదివితే పై సందేహాలు తొలగుతాయి. జగద్విఖ్యాతిగాంచిన 'వెబ్స్' దంపతులకంటే నిష్పక్షపాతంగా వ్రాసేవారెవరూ వుండరుగదా! వారిచే రచింపబడిన "సోవియట్ రష్యాను గురించిన నిజం ఏమిటి?" అనే గ్రంథం అందరూ చదవదగింది. దీనిలో "స్టాలిన్ డిక్టేటరా?" "సోవియట్ ప్రజాస్వామికమా, కాదా? సోవియట్‌యూనియన్‌లో జాతివిచక్షణ లేదనేమాట సత్యమేనా?" అనే ప్రశ్నలకు చక్కగా జవాబు యిచ్చారు వెబ్స్ దంపతులు. డీన్ ఆఫ్ కాంటర్‌బరీ రచించిన "సోషలిస్టు ప్రపంచం" అనే గ్రంథంకూడ యిలాంటిదే. ఏసుక్రీస్తు ఆశయాలను అనుసరించుతూ, మతస్వాతంత్ర్యంకోరే ఉత్తములు వీరికంటే మరొకరు లేరుకదా? అతని పుస్తకంలో సోవియట్ రాజ్యాంగ 'ప్రపంచంలో అన్నిటికన్నా ప్రజాస్వామికమైనది'దని స్పష్టపరచబడింది. సోవియట్‌యూనియన్‌లో నేడు మత స్వాతంత్ర్యం లేదనడం శుద్ధఅబద్ధమని యీ ఉన్నత మతాధికారి తేటతెల్లం చేశాడు. ప్రతిపౌరుడు తన మతవిశ్వాసాలను కలిగివుండ వచ్చుననీ, యితరులను తన వైపుకు త్రిప్పుకోవచ్చుననీ, వీరు స్పష్టపరచారు. కొందరనుకొంటున్నట్లుగా స్టాలిన్ ప్రాచ్యదేశాలకు చెందిన నిరంకుశాధికారి కాడని డీన్ ఆఫ్ కాంటర్‌బరీ విశదపరచారు. నూతన సోవియట్ జీవితవిధానాన్ని గురించి చెబుతూ 'మానవాభ్యుదయానికి ఉపకరించే సోవియట్ విజయాలను చూచి ప్రతి ప్రజాస్వామ్య వాది సంతోషించి తీరాలి'అని డీన్ వక్కాణించారు. మూఢవిశ్వాసాలు తొలగడం కష్టసాధ్యమని మాకు తెలుసును. కాని దుష్ప్రచారం చేస్తున్న అనుమానయ్యలు, చొప్పవాగుడుగాళ్ళు కనీసం విజాయితీగా మెలగాలని కోరుతాము. వారు అర్థంచేసికోలేకపోతే మానె, కనీసం నిందలను సృష్టించవద్దని మనవి.

గమనిక

★

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం ఆఫీసువకు బెల్లిగ్రాముల పంపువారు చేటభారతమంత ఎడ్రసులు వ్రాస్తున్నారు. డబ్బు దండుగ చేస్తున్నారు. ఆఫీసు టెలిగ్రాం ఎడ్రసు "Ryotusangh, బెజవాడ" కాబట్టి గుర్తించ కోర్తాను.

కార్యదర్శి

మైకా కార్మికుల కడగండ్లు

కేంద్రప్రభుత్వం 1944 అక్టోబరులో మైకాయింక్వైరీకమిటీని నియమించింది. దానిలో కార్మికుల పక్షమున్నుంచికూడ ఒక ప్రతినిధిని తీసుకున్నారు. బీహార్ మైకా మజ్దూర్ యూనియన్ అధ్యక్షులైన భట్టాచారిగారు కార్మికుల ప్రతినిధిగా యీ కమిటీలో పాల్గొంటున్నారు. ఫిబ్రవరి 8 వ తేదినుండి గూడూరు మైకాగనుల పరిస్థితులను విచారణ చేయుటకు యీ కమిటీ ప్రారంభించింది. 12 వ తేదీన గూడూరులో 450 మంది స్త్రీలు ఊరేగింపులో వెళ్ళి తమ కష్టాలను ఈ కమిటీకి విన్నవించుకున్నారు.

గూడూరు మైకావర్కర్సు యూనియన్ యీ క్రింది మెమోరాండమును విచారణ కమిటీకి సమర్పించారు. (దాని సారాంశము ప్రకటించుచున్నాము.)

కార్మికులస్థితి

గూడూరు డివిజనులో మైకా పరిశ్రమ మీద షుమారు లక్షమంది జీవించుచున్నారు. ఇందులో 30 వేలు. గనులలోను 20 వేలు స్ప్లిట్టింగు కంపెనీలలోను పనిచేస్తున్నారు. (స్ప్లిట్టింగ్ అంటే గనుల నుండి తెచ్చిన మైకాను సైజులవారీగా విభజించి ఎగుమతుల కోసం పెద్దెలందు అమర్చడం.) వీరుగాక మైకాను తమ యిండ్లదగ్గర స్ప్లిట్టుచేసి జీవించేవారు 50 వేలమంది వున్నారు. మొత్తం భారతదేశ వుత్పత్తిలో నాలుగవవంతు మైకా ఇక్కడ తయారగుతున్నది. ప్రపంచ వుత్పత్తిలో నూటికి 75 వంతులు మనదేశంలో తయారగుచున్నది. ఇందులో బీహారు యెక్కువభాగం వుత్పత్తి చేస్తున్నది.

మనదేశంలో మైకా యింత వుత్పత్తి అగుచున్నదే కాని దాన్ని వుపయోగించుకునే పరిశ్రమలు అభివృద్ధికాలేదు. దీనిని యెలక్ట్రిక్ ఫిట్టింగ్సులోను, విమానపరిశ్రమలందును, ఎక్కువగా వుపయోగిస్తారు. మనదేశంలో ఈ పరిశ్రమ అభివృద్ధి కాకపోవడంవల్ల మనదేశమునుండి మైకా యితర దేశములకు యెగుమతవుతూంది. యుద్ధంప్రారంభమైన తరువాత ఎక్కువభాగం బ్రిటన్ అమెరికా దేశాలకు పోతున్నది. ఈ వ్యాపారాన్ని సాగించటానికి యీ రెండు దేశస్థుల పెట్టుబడిదారులు ఏకమై జాయింట్ మైకా సంస్థనొకదానిని ఏర్పరచారు.

మైకా ధరలు తగ్గించటానికి ఈ సంస్థ అనేక కుతంత్రాలు పన్నుతున్నది. మైకా నాశిరకంగా వున్నదనే నెపంతో కొంతభాగం కొనటం మానివేశారు. ఈ సంస్థ యేర్పడకపూర్వం ఇలాంటి విభజన ఉండేదికాదు. ఇప్పుడీ విభజన కొత్తగా తెచ్చిపెట్టి మంచిరకం అయితేనే కొంటామంటున్నారు. ధరలు కూడా తగ్గించారు. చాలాభాగం మైకా నిలచిపోవుటవల్ల కార్మికులు నిరుద్యోగులగుచున్నారు. అందువలన ప్రభుత్వం సరసమైన ధరలు నిర్ణయించి పూర్వం మాదిరిగానే మైకాను యీ జాయింటు మైకాసంస్థ వారు కొనేటట్లు చెయ్యాలి. లేనిపక్షమున యీ మైకా కార్మికులు నిరుద్యోగులై, మైకాపరిశ్రమయే అంతరించిపోతుంది.

గనులలో పనిచేసేవారికి స్ప్లిట్టింగు కంపెనీలలో పనిచేసేవారికి జీతాలు 7 అణాలు మొదలుకొని 10 అణాలు వరకు మాత్రమే యిస్తున్నారు. ఈ సంపాదనతో పొట్టనింపుకొనలేక రోజుకు 3, 4 గంటలు అదనముగా పనిచేస్తున్నారు. పనిబిడ్డలుకూడ పనిచేయుట అనేక గనులలో జరుగుతున్నది. స్త్రీలు కూడ ఈ గనులలో ప్రొద్దుపోయిన తరువాత కూడా పనిచేయవలసి వస్తున్నది. ఈ కార్మికుల జీవితం సంక్లిష్టమై పోతున్నది. వీరిని యీ దారిద్ర్య పెనుభూతాన్నుండి కాపాడాలంటే కనీసం నెలకు రు. 30 లు జీతం ముట్టేటట్లు ప్రభుత్వం చూడాలి. సరసమైన కరువు భత్యం కూడా వీరికి లభ్యంకావాలి.

ఈ మైకా పరిశ్రమలో పనిచేసేవారిలో నూటికి 50 మంది వరకూ స్త్రీలు గనులలో పనిచేస్తున్నారు. చట్టంప్రకారం వీరికి ప్రసూతి సౌకర్యాలను యజమానులు కలుగచేయుట లేదు. వైద్యసహాయం సున్న. గూడూరుకు వస్తేనే కాని మందునీళ్ళు గొంతులో పడటానికి వీలుంది. ఈ గనులవద్ద పనిచేయువారికి వైద్యసౌకర్యాలు యేర్పాటుచెయ్యాలి. ప్రసూతిసౌకర్యాల చట్టం ఖచ్చితంగా అమలు జరిగేటట్లు చూడాలి.

స్ప్లిట్టింగు కంపెనీ 50 మొదలుకొని 100 మంది వరకూ (దాదాపు అంతా స్త్రీలే) పనులు చేస్తారు. ఈ కంపెనీలకు ఫ్యాక్టరీలచట్టం వర్తించదు. గనుల చట్టంక్రిందకూ వీరురారు. అందువల్ల యిక్కడ రాత్రింబగళ్ళు ఈ స్త్రీల చేత పనులు చేయిస్తున్నారు. ఫ్యాక్టరీ అక్టులో నున్న ఆరోగ్యరక్షణలుకూడ వీరు పొందలేకపోతున్నారు. ప్రసూతి సౌకర్యాలచట్టం వీరికి వర్తించుటలేదు. ప్రభుత్వం వెంటనే ఫ్యాక్టరీ అక్టు, మైన్సు ప్రసూతిసౌకర్యాల చట్టం వీరికి వర్తించేటట్లు చెయ్యాలి.

గనులలో పనిచేయువారికి కార్మికుల నష్టపరిహార చట్టం తూ. చా. తప్పకుండా అమలులో పెట్టాలి. కార్మికులు అపాయాల పాలైనప్పటికి కూడా యజమానులు పరిహారము యివ్వటానికి నిరాకరించుచున్నారు. ఈ గనులకు దగ్గరగా 20 మైళ్లలోపులో హాస్పిటల్సు లేవు. గూడూరు రావలసిందే. కాని ఈ కార్మికులు అపాయాల పాలైనప్పుడు శ్రద్ధతో యే నాథుడు గూడూరు హాస్పిటల్సుకు చేరుస్తాడు? అందువలన గాయములు మానుటకు వీలున్నప్పుడు కూడా వైద్య సహాయము వెంటనే కలుగనిపోవుటవల్ల చాలా మంది కార్మికులు శాశ్వతంగా వికలాంగులవుతున్నారు. వీరికి వైద్యసహాయము చేకూర్చేందుకు యజమానులు ప్రత్యేకశ్రద్ధ వహించాలి.

ఇండ్ల వసతులు

ఈ గనులవల్ల విపరీతమైన లాభాలను యజమానులు పొందుతున్నారు. కాని కార్మికులకు యే విధమైన సౌకర్యాలు కల్పించబడలేదు. వీరు పనులు చేయుటకు చుట్టుప్రక్కల మైళ్ళ దూరంలోవున్న గ్రామాలనుంచి రావలసివస్తున్నది. వీరికి నివసించేందుకు గుడిశలైననూ సరిగా వుండుటలేదు. వీరికి గృహవసతులు వెంటనే యేర్పాటు చెయ్యాలి.

ప్రజాశక్తి చందావివరాలు

★

సంవత్సరం చందా	5—0—0
అర్ధసంవత్సరం చందా	2—8—0
మూడునెలలచందా	1—4—0

మహాశివరాత్రినాడు ★ ★ వలంటీర్ల ప్రజాసేవ

"మాకు దేవునిలాగ సాయపడ్డారు. మీరు లేకపోతే, మాకు కొన్నిరోజులవరకూ కూడూ, నీళ్ళుండేవికావు"

మారుపడిపోయిన ఒక బిడ్డతండ్రి, ప్రజారక్షణదళం తిరిగి బిడ్డను తన కప్పగించినప్పుడు పల్కిన ప్రశంసావాక్యం యిది.

మహాశివరాత్రి హిందువుల పర్వదినం. ఒక నదిలోనో, సముద్రంలోనో, స్నానంచేసి తరిద్దామనుకొనడం సామాన్యంగా హిందువుల నమ్మకం.

మొన్నటి శివరాత్రినాడు బెజవాడ క్రిష్ణా స్నానానికి యినుకవేస్తే రాలకుండా యాత్రికులు వచ్చారు. క్రిష్ణాతీరం యావత్తూ తీర్థయాత్రికులతో క్రిక్కిరిసిపోయింది. ఆ సందడిలో - ఆత్రొక్కిసలాటలో ఎంతమందోపిల్లలు తలిదండ్రులనుంచి తప్పిపోవడం - దొంగలు తమ పనికాస్తా చక్కపెట్టుకొనడం జరుగుతూ ఉంటుంది. ఈ త్రొక్కిసలాటలో ప్రజలు ఆదరాబాదరా స్నానం చేసే ఆతావిడిలో అమూల్యమైన వస్తువుల్ని మరచిపోవడం - లోతు తెలియక మునిగిపోవడం జరుగుతూ ఉంటుంది.

అయితే, బెజవాడ ప్రజారక్షణదళం ప్రజలకు సంభవించే యీ గండాలనుంచి రక్షించ ప్రయత్నించింది. కృష్ణాతీరాన ప్రజారక్షణ దళ కార్యాలయాన్ని నిర్మించింది. తప్పిపోయిన పిల్లలుగాని, పోయిన వస్తువులుగాని, దొరికితే కార్యాలయంలో వప్పగించడానికి యేర్పాట్లు జరిగాయి. యాత్రికులు కార్యాలయానికొచ్చి, వస్తువులు పోయినా, దొరికినా వైనం తెలుపుతూ ఉండేవారు. ప్రజారక్షణదళ వలంటీర్లు లాకుగోడమీదనుండి మేగఫోనుల ద్వారా అనూ వైనమును ప్రజలలో ప్రచారం చేశారు. దీని ఫలితంగా, తప్పిపోయిన 28 మంది బాలురను తమ తల్లిదండ్రులకు వప్పగించడం జరిగింది. ఎన్నో విలువగల వస్తువులను వెతకి పట్టుకొని స్వంతదారులకు చేర్చారు. వలంటీర్లంతా దళాలుగా యేర్పడి, పారిశుధ్యాన్ని కాపాడ్డానికి, రాకపోకలు సులువు చేయడానికి, పోయిన వస్తువులను, మారుబడ్డ పిల్లలను ఆచోకీ తీయడానికి - మొదలైన కార్యాలను నెరవేర్చడంలో నిమగ్నులైనారు. నీటిలో మునిగిపోయిన యాత్రికులను బోటుసహాయంతో రక్షించారు. జన సమ్మర్దంగల ప్రదేశంలో అంటువ్యాధులు బయల్దేరడం సహజం. అందువల్ల వలంటీర్లు ఆరోగ్యసూత్రాలను బోర్డులమీద వ్రాసి, యాత్రికుల్లో విరివిగా ప్రచారంచేశారు. ఈ విధంగా యాత్రికుల కన్నివిధాలా సాయపడి, అంటువ్యాధులకు గురికాకుండా వారి ధన ప్రాణాలు రక్షించిన ప్రజారక్షణదళ వలంటీర్లు ప్రజల ఆదరాభిమానాలకు పాత్రులవడంలో ఆశ్చర్యమేముంది? శివరాత్రి సందర్భంలో ప్రజారక్షణదళం వారు హుండీలద్వారా రు 33-12-0 లు వలంటీర్ దళనిర్మాణనిధికి వసూలుచేశారు.

"వాళ్లు కమ్యూనిస్టులు. వాళ్లకు సహాయం చేయకండి" అని ఘోషించే ప్రజా వ్యతిరేకుల మాటలు లెక్కచేయక, సేట్ హీరజీ గణపత్ గారివంటి పెద్దమనుష్యు లెందరో వలంటీర్లకు సాయపడ్డారు. "నా కెవరైతేనేం? ప్రజాసేవ చేసేది ప్రజారక్షణ దళంవారే" అంటూ లెక్కలేనంతమంది, వలంటీర్ల ప్రజాసేవను అభినందించారు. "ఏలాంటి ప్రమాదాలు ఉండవులే! మనసంఘం అబ్బాయిలు వుంటారు. బయల్దేరండి" అంటూ ముసలమ్మలు ప్రోత్సహించడం-తీరా యాత్రికులు తీర్థమాడి, స్వస్థలాలకు సుఖంగా చేరడం జరిగింది. ప్రజారక్షణదళంవారికి జోహారులర్పించని యాత్రికుడు లేడంటే అతిశయోక్తి లేదు.

చల్లపల్లి జమీందారు దౌష్ట్యం

పెదకళ్లేపల్లి తిరునాళ్ళలో గత రెండు సంవత్సరాలుగా వలంటీర్లు ప్రజాసేవ చేస్తున్నారు. ఏటా వలంటీర్లకు ఆశ్రయమిచ్చే రైతు భూమికి నీరువదలక, చల్లపల్లి జమీందారు నానాబాధలు పెట్టాడు. ఈ సంవత్సరం అద్దెకు కూడా యిండ్లు దొరకకుండా తన పలుకుబడిని ఉపయోగించాడు. కాని వేరొక వసతిగృహం యేర్పాటయింది.

కృత్తివెన్ను, బోగేశ్వరం, వెల్వాడం మొదలైన గ్రామాలకు శివరాత్రినాడు వేలకొలది ప్రజలు వచ్చారు. విశేషంగా రైతులువచ్చారు. ఆరోగ్యసూత్రాలనుగురించి, రైతుహక్కులను, కర్తవ్యాలను గురించీ, అధికాహారోత్పత్తిని గురించీ, గావించబడ్డ ప్రచారం ప్రజలను ఉత్సాహభరితులనుచేసింది. వారు తమ కర్తవ్యాన్ని గ్రహించారు. రైతు భజనలు, "రైతుహరికథలు", నాటకాలు మొదలైన వైజ్ఞానిక ప్రదర్శనాలు రైతులకెంతో ఉత్తేజం కలిగించాయి. ఈ సందర్భంలో వలంటీర్లు చేసిన సేవను ప్రశంసించనివారు లేరు.

నెల్లూరుజిల్లా, కోటితీర్థంలో ప్రతి మహాశివరాత్రికి జూదం, దొంగతనం, వ్యభిచారం, పోలీసుల జులుం, లంచగొండితనం విచ్చలవిడిగా సాగుతుంటాయి. కాని యీ సంవత్సరం కమ్యూనిస్టు వర్కర్లకలుగజేసుకొని తీవ్రప్రచారంచేయడం మూలంగా యీదురాచారాలు చాలవరకు అరికట్టబడ్డాయి. వాసిలి గ్రామంలో శివరాత్రిరోజున బాల, యువజన సంఘాలవారు "ప్రతిమ" నాటకం ప్రదర్శించారు.

కమ్యూనిస్టులు కాంగ్రెసులో అంతర్భాగంగా ఉండవచ్చు

కార్మికుల సన్మానసభలో దేశభక్తుని దివ్యసందేశం

15—2—45 వ తేదీని దేశభక్త కొండా వెంకటప్పయ్యగారి 80 వ జన్మదినోత్సవ సందర్భంలో గుంటూరు పట్టణ ట్రేడ్‌యూనియన్ కౌన్సిల్ యాజమాన్యాన 2000 మంది కార్మికులు సన్మాన పత్రం సమర్పించారు. కామ్రేడ్ వి. వి. శివయ్య సభకు అధ్యక్షత వహించాడు. కాయ కష్టం చేసే వారి స్వాతంత్ర్య పిపాసకు దేశభక్తుడు మురిసిపోయాడు. ఉత్సాహంతో కార్మికులకు యీ క్రింది దివ్యసందేశమిచ్చాడు:

"మీది కష్టజీవనం. చెమటోడ్చి కష్టించే మీ జీవితం మీదనే అందరిజీవితం ఆధారపడి ఉంది. మీక్షేమం మీదనే అందరిక్షేమం, దేశాభ్యుదయం, ఆధారపడి యున్నవి. మిమ్ములను గుర్తించి ప్రవర్తించవలసిన బాధ్యత తక్కిన వారందరిపైన ఉంది.

"యుద్ధానంతరం అమలుపెట్టేందుకు ప్లానులపై ప్లానులు వేస్తున్నారు. కాని, ఎన్ని ప్లానులు వేసినా, జాతీయైక్యతతో జాతీయ ప్రభుత్వం స్థాపించనిదే నిజమైన ధర్మమార్గం అమలు జరగదు. సర్వ సంఘములవారు, ఏ భేదాభిప్రాయములున్నా, ఏకాదర్శంతో సర్వస్వం ధారపోసి స్వరాజ్యం సంపాదించాలి.

"నేను ఆంధ్రోద్యమానికి చేసినకృషిని గురించి అధ్యక్షులూ, గోపాలకృష్ణయ్యగారూ, చెప్పారు. ఆంధ్రరాష్ట్రం మన కింతవరకు సిద్ధించకపోవడం శోచనీయమే. కాని, స్వాతంత్ర్య రహితమైన ఆంధ్రరాష్ట్రం ఆంధ్రరాష్ట్రంకాదు. ఏనుగుతిన్న వెలగకాయ; జీవంలేని శవం. జాతీయ ప్రభుత్వం ఏనాడు లభిస్తుందో, ఆనాడే ప్రత్యేకాంధ్రరాష్ట్రం అమల్లోకి వస్తుంది. కనుక మనమంతా కాంగ్రెసు సందేశాన్ని మనసులో పెట్టుకొని, కమ్యూనిస్టులయేది - కార్మికులయేది. అందరూ ఆ మహాసంస్థలో అంతర్భాగములుగా ఉండి పనిచేయాలి. అలా వారిని పరిగణించాలి. స్వాతంత్ర్యం కొరకు అంతా దీక్షతో పనిచేయాలి.

"మనకు స్వరాజ్యంవస్తే, లోకకల్యాణార్థం దానిని వినియోగించుతాం. ఎన్ని కష్టములు వచ్చినా, ఇప్పుడే వస్తాయి. స్వాతంత్ర్యం వచ్చాకరావు. మనదేశం రత్నగర్భ. బుద్ధిశక్తులు తక్కువకావు. వస్తుసంపద తక్కువకాదు. మణులు, మాణిక్యాలు, లోహం, బొగ్గూ, అన్నీ ఉన్నాయి. 40 కోట్ల ప్రజలం. ప్రపంచంలో అయిదోవంతు మనం. ఐక్యతతో మనం పూనుకొని, పనిచేస్తే, మనలనెవరూ ఏమీ చేయలేరు. సంపూర్ణ స్వాతంత్ర్య సంపాదనమే ప్రధానం. అనేక ఉద్యమాలలో బాధలు పడ్డాం. ప్రతిఫలం లేకపోలేదు. మీరంతా కార్మికులు; సాధారణ ప్రజలు. మీలో యింతచైతన్యం కలిగిందంటే, స్వరాజ్యం వచ్చి తీరుతుందనే విశ్వాసం కలిగిందంటే, అది మన జాతీయోద్యమ ఫలితమే". గాంధీజీ దేశానికిచ్చిన నిర్మాణకార్యక్రమాన్ని వివరించి, దేశభక్తుడు యిలా ముగించాడు:-

"నా కాలం వెళ్లిపోయింది. పరమేశ్వరుడిచ్చిన కాలంలో నేను చేతనైనంతపని చేశాను. మీమీద బ్రహ్మాండమైన బాధ్యతవుంది. ఎంత బాధ్యతనైనా మీరు నెరవేర్చగలరని నాకు నమ్మకం వుంది. మీరు ఈనాడు నాకు ప్రేమతో యిచ్చిన సన్మానం నన్ను ధన్యుణ్ణిచేసింది."

★

ఇలాగే, 16—2—45 వ తేదీని తాడికొండ (గుంటూరు తాలూకా) లో శ్రీ కొండా వెంకటప్పయ్య పంతులుగారికి భారతీపుస్తక భాండాగారం తరపున, గ్రామ రైతు, యువజన, వ్యవసాయ కూలీ, మహిళా, బాలసంఘాల తరపున, గ్రామ కమ్యూనిస్టు కమిటీ తరపున, గొప్ప సన్మానం జరిగింది.

కృష్ణాజిల్లాలో రైతుమహాసభలు

●

నందిగామతాలూకా రైతుమహాసభ — కంచికచర్ల

మార్చి 8, 9 తేదీలలో

అధ్యక్షులు: శ్రీ నండూరి ప్రసాదరావుగారు
ప్రారంభకులు: శ్రీ పుచ్చలపల్లి సుందరయ్యగారు

కైకలూరుతాలూకా రైతుమహాసభ — సీతనపల్లి

మార్చి 12, 13 తేదీలలో

అధ్యక్షులు: శ్రీ ముక్కామల నాగభూషణంగారు
ప్రారంభకులు: శ్రీ కాట్రగడ్డ రాజగోపాలరావుగారు

గన్నవరంతాలూకా రైతుమహాసభ — తేలప్రోలు

మార్చి 10, 11 తేదీలలో

అధ్యక్షులు: శ్రీ నండూరి ప్రసాదరావుగారు
ప్రారంభకులు: శ్రీ రావి నారాయణరెడ్డిగారు (నైజాం ఆంధ్రమహాసభాధ్యక్షులు)

బందరుతాలూకా రైతుమహాసభ — పెడన

మార్చి 20, 21 తేదీలలో

అధ్యక్షులు: శ్రీ చలసాని వాసుదేవరావుగారు
ప్రారంభకులు: శ్రీ కాట్రగడ్డ రాజగోపాలరావుగారు

బెజవాడతాలూకా రైతుమహాసభ — వెల్వాడం

మార్చి 7, 8 తేదీలలో

అధ్యక్షులు: శ్రీ కాట్రగడ్డ నారాయణరావు, యం. యల్. ఏ. గారు
ప్రారంభకులు: శ్రీ ముక్కామల నాగభూషణంగారు

మునగాల పరగణా రైతుమహాసభ — మునగాల

మార్చి 12, 13 తేదీలలో

అధ్యక్షులు: శ్రీ అనుమర్లపూడి సీతారామారావుగారు

బస్తర్ సంస్థానంలో ★ ★ ఉపాధ్యాయులు కావాలి

అయ్యా,

బస్తరుస్టేటు వైశాల్యము 13,000 చదరపుమైళ్లు. ఈ స్టేటు ఉత్తరముననున్న మధ్యపరగణాలను (సి. పి.) దక్షిణముననున్న గోదావరితో కలుపుచున్నది; తూర్పుననున్న ఒరిస్సాను; పడమటనున్న నైజాముర్యాజ్యముతోను కలుపుచున్నది. ఈ స్టేటులోని ప్రజలు 6,35,050 మాత్రమే. బస్తరుయొక్క దక్షిణభాగమందలి ప్రజలు తెలుగు మాట్లాడువారు. అయిననూ, అచ్చట హిందీ పాఠశాలలుమాత్రము గలవు. దీనివిషయమై చాలమంది ఆంధ్రులకు తెలియనే తెలియదు.

కాని, ఈమధ్య బస్తరుదర్బారువారు ఈ తెలుగుమాట్లాడు భాగమందు 8 ప్రయిమరీ పాఠశాలలు ప్రారంభింప నిశ్చయించిరి. అందుచే ప్రస్తుతము యీ స్టేటుకు ఎనమండుగురు ప్రయిమరీ ఉపాధ్యాయులు కావలెను.

అందుచే ఎవరైనను ఎనమండుగురు ఉపాధ్యాయులపేర్లు సూచించమని నా ప్రార్థన. వారు పాఠశాలలోని బాలురకు విద్యగరపుటయేగాక, వయోజనవిద్య, ఆధునికపద్ధతుల్లో వ్యవసాయము మొదలగువానివల్ల, అచ్చటి ప్రజలను (ఆంధ్రులను) ఉన్నతిలోనికి తెచ్చుటకు ప్రయత్నింపవలెను. ఇట్టి సాంఘిక సేవకులు (మే, 1945 లో చేరుటకు సిద్ధముగానున్నవారు) అప్లికేషన్లు పంపమని నా ప్రార్థన.

ఈ ఉపాధ్యాయుల జీతములు చాలా తక్కువగా నున్నవని వ్రాయుటకు నేను చాలా చింతించుచున్నాను. త్యాగబుద్ధిగల ఉపాధ్యాయులపేర్లు మీవంటివారు పంపకపోయినచో యీస్కీము (తెలుగుపాఠశాలల స్థాపన) విజయము కానేరదని నా నమ్మకము.

జీతములు:—

హెడ్‌మాస్టర్	రు. 20—1—30/—
ట్రైన్డ్ అసిస్టెంటు మాస్టర్	రు. 15—½—20/—
అన్‌ట్రైన్డ్ అసిస్టెంటు మాస్టర్	రు. 12—½—15/—

1945 మార్చి 10 వ తేదీకి ఉపాధ్యాయులను నియమించుటకు వీలగునట్లు దీనికి మీ జవాబు త్వరలో (అప్లికేషన్లతోసహా) పంపెదరని ఆశించుచున్నాను.

V. K. Rao,
Dy. Inspector of Schools (South Bastar State)

వి. కె. రావు,
(డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్సు బస్తర్ సంస్థానం)

★ గుంటూరుజిల్లా ఆహారమహాసభ

ఆహారసమస్య విషయంలో భేదాభిప్రాయాలకు తావులేదు

●

కరువు కాటకాలనుండి ప్రజలను కాపాడుతూ, అమోఘమైన ప్రజాసేవచేసి గుంటూరు జిల్లా ఆహారకమిటీ ఏడాదిగడిపింది. మొన్న 18వ తేదీని ద్వితీయ వార్షిక మహాసభ జరుపుకొంది.

ఏడాదిలో

6 తాలూకా కమిటీలు, 4 పట్టణ కమిటీలు, 88 గ్రామకమిటీలు ఇప్పుడు జిల్లా కమిటీకి పునాది. ఇదంత గత సంవత్సరంలో జరిగిన నిర్మాణమే. ధాన్యాధర పుట్టివద్ద రు. 11 లు నిర్ణయం కావాలనీ; జోనల్ స్కీము అమలుజరగాలనీ; తప్పడు, నూకలు కూడా కంట్రోలు ఏర్పరచాలనీ; పర్మిట్లు ఇచ్చేటప్పుడూ, పర్మిట్లకు మిల్లులో బియ్యం ఇచ్చేటప్పుడూ అక్రమాలు జరుగకుండా చూడాలనీ, జిల్లాకమిటీ గతసంవత్సరం ఆందోళన చేసింది. మాగాణి తాలూకాల రైతులు అధికధరలు కాశించకుండా తమ ధాన్యాన్ని రు. 11 లు చొప్పున కొరత ప్రాంతాల ప్రజలకు సప్లయిచేయాలని ప్రచారంచేసింది. దొంగవ్యాపారాన్ని, లంచగొండి తనాన్ని తీవ్రంగా ఎదుర్కొని, అనేక విజయాలు సాధించింది. ఉదాహరణకు—వరుసగా పది ఇన్‌స్పెక్టరు లంచం తీసుకొంటే, తేముపెట్టి పట్టించి చేయించింది జిల్లా ఆహారకమిటీ.

ఈకమిటీ కృషి ఫలితంగానే ఒంగోలు మినహా మిగతా మునిసిపల్ పట్టణా లన్నిటిలోను రేషనింగు అమలులోకి వచ్చింది. పత్తెనపల్లి, చిలకలూరిపేట, గురజాల, మాచెర్ల, రెంటచింతల, వినుగురాళ్ళ మొదలైన ప్రదేశాల్లో ప్రజలకు నచ్చచెప్పి, వారి సహకారంతో రేషనింగు ప్రవేశపెట్టించింది. అనేక గ్రామాల్లో పర్మిట్లద్వారా ఎప్పటి కప్పుడు బియ్యం సప్లయి జరిగేలా చేసింది.

అంతటితో ఆగలేదు. గుంటూరుజిల్లా ఆహారకమిటీ కృషి—18 ప్రదేశాల్లో కోఆపరేటివ్ స్టోర్సును అభివృద్ధి పరచి, వాటి సహకారంతో ఆహారసమస్యనెదుర్కొంది. రేపల్లె, గుంటూరు మొదలైనచోట్ల కిరసనాయిలు సమస్యను పరిష్కరించింది. రేపల్లె, ఒంగోలు తాలూకాల్లో మలేరియా నివారణకు పూనుకొంది. ఈ కార్యక్రమం అంతటిలోను ఇతర ప్రజాసంస్థల సహకారం పొందింది. గర్వించదగిన ఈ రిపోర్టును కార్యదర్శి శ్రీ యస్. వి. యల్. నరసింహంగారు చదువుతూంటే, అన్నితాలూకాలనుండి వచ్చినఆరెండువందల మంది ప్రతినిధులు ఎంతో ఉత్సాహంపొందారు.

ఇకముందు

వచ్చే ఏడాదిలో సాధించవలసిన కార్యక్రమాన్నికూడా కార్యదర్శి విశదపరిచారు. జోనల్ స్కీము జిల్లా అంతటా ప్రవేశపెట్టించాలి. ప్రభుత్వమే కొని విల్వచేయక పోవడంవల్ల ధాన్యమంతా తిండిదొంగల చేతుల్లోకి పోతూంది. రైతులకు న్యాయమైన రు. 10 లు ముట్టడం లేదు. రైతుకు ఈధర ముట్టేలాగూ, ప్రభుత్వమే ధాన్యం కొని విల్వచేసేలాగూ, కృషిచేయవలసిఉంది. అంటువ్యాధులను అరికట్టాలి. ఇందుకు ఇతర ప్రజాసంస్థల సహకారాన్ని పూర్తిగా పొందాలని కార్యదర్శి వివరించారు. ఈకార్యక్రమంలోని సాధకబాధకాలను ప్రతినిధులు కార్యదీక్షతో చర్చించారు.

'ప్రజాసేవే ప్రధానధర్మం'

తరువాత తీర్మానాలు ఆమోదింపబడ్డాయి. మహాసభాధ్యక్షులు దివాకరుని లక్ష్మీనారాయణగారు జాతీయనాయకుల విడుదలను, జాతీయ ప్రభుత్వ స్థాపనను కోరుతూ తీర్మానం ప్రతిపాదించారు అమితోత్సాహంతో ఈ తీర్మానాన్ని అంతా ఆమోదించారు

అన్ని పార్టీలవారు ఆహారకమిటీలోచేరి, ఆహారసమస్యా పరిష్కారం విషయంలో తోడ్పడాలని కోరుతూ యస్. వి. యల్. నరసింహంగారుమరొకతీర్మానాన్నిప్రతిపాదించారు. ఆ సందర్భంలో వారిలా మాట్లాడారు:

"నేను కాంగ్రెసువాదిని ....నా తొమ్మిదో ఏటనుండి కాంగ్రెసంటే భక్తి విశ్వాసాలు కలిగిఉన్నవాడిని. కాంగ్రెసు ఆశయం ప్రజాసేవ. గాంధీజీ కంటె కాంగ్రెసు నాయకులెవరు? తైలు మంచి రాగానే వారే మన్నారు? స్థానిక పరిస్థితుల కనుగుణ్యంగా ప్రజాసేవ చేయడమే కాంగ్రెసువాదులందరి ధర్మమన్నారు. ప్రజాసేవే ప్రధానంగా పెట్టుకున్న వారెవరూ ఆహారసమస్య విషయంలోనూ ఇతర విషయంలోనూ భేదాభిప్రాయాలు కలిగిఉండవక్కర్లేదు. నేను ఆహారకమిటీలోఉండి ప్రభుత్వోద్యోగులతో సహకారం చేస్తున్నానని కొందరు మిత్రులు వన్నెత్తిపొడిచారు. వారికి తగినసమాధానమిదే: ఆహార కమిటీద్వారా నాశక్తికొద్దీ ప్రజాసేవచేస్తున్ననన్ను కాంగ్రెసువాదినికాదన డానికి ఎవరికిఅర్హతవుంది? తోటిసహచరులు ప్రధానమా? ప్రజానీకం ప్రధానమా? అని ప్రశ్నించుకున్నప్పుడు మున్ముందటికి ప్రజానీకమే అని నిర్ణయించు కున్నాను. అందుచే ఆహారకమిటీలో ఉన్నాను. ఆహార సమస్యలో పనిచేసే పర్కార్లంతా కాంగ్రెసువాదుల నందరినీ క్షమనుకొని. ఓపికతోనచ్చ చెప్పవలసిఉంది. విసనంతికోపగించుకోకుండా రండి. వారి వ్యతిరేకత శాశ్వతంకాదు. ప్రజలు శాశ్వతం. ఏరోజుకో ఒకరోజుకు వారే రాక తప్పదు ప్రజాసేవకు."

వీరి తీర్మానాన్ని శ్రీ కొమ్మారెడ్డి వెంకటరెడ్డిగారు బలపరిచారు.

పై తీర్మానం ఆమోదింపబడిన తరువాత వి. యస్. తల్పశాయిగారు ఆహారపరిస్థితిని చక్కబరచడానికి తొమ్మిది సూచనలుచేస్తూ, ఒకతీర్మానంప్రవేశపెట్టారు. జోనల్‌స్కీము తిరిగి ప్రవేశపెట్టాలనీ, ధాన్యం ధర పుట్టివద్ద రూ.11లు. నిర్ణయించాలనీ, కోఆపరేటివ్‌స్టోర్సు ద్వారా హోల్‌సేల్ పంపకం జరిగేలా చూడాలనీ, మిల్లుయజమానులకు—చిల్లరవర్తకులకు మధ్య హోల్‌సేల్ వర్తకులు అనవసరమనీ, అందులో సూచించారు. మరికొన్ని తీర్మానాలు జరిగిన తరువాత కొత్త సంవత్సరానికి కార్యవర్గాన్నెన్నుకున్నారు.

అధ్యక్షులు — శ్రీ వి. యస్. తల్పశాయి.

(బార్. ఎట్. లా.)

ఉపాధ్యక్షులు - శ్రీ డి. యల్. నారాయణ.

,, నాళం మట్టుపల్లి.

,, జనాబ్ మహబ్‌సాహెబ్.

శ్రీ చదలవాడ ఉమామహేశ్వరరావు.

కార్యదర్శి — శ్రీ యస్. వి. యల్. నరసింహం

సహాయకార్యదర్శులు—శ్రీ కె. కుటుంబరావు

,, జి. వి. చౌదరి

(బార్-ఎట్-లా)

మరి 16 మంది కార్యవర్గసభ్యులుగా ఎన్నుకోబడ్డారు.

మొదటినుంచీ

ప్రజాసంస్థల్లో ప్రధానమైన 'అఖిలభారత రైతుసంఘం' కరువు ప్రమాదాన్ని గురించి ఏనాడో హెచ్చరించింది. తగు జాగ్రత్తలను గురించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది. ఈనాడు ప్రజలు తమ ఆహారకమిటీని స్థాపించుకొని ఆహారసమస్యను పరిష్కరించుకొంటున్నారు. ముక్కామల నాగభూషణంగారు మహాసభను ప్రారంభిస్తూ ఈవిషయాన్నిగురించి ఇలా అన్నారు:

"1940 మార్చిలో జరిగిన పలాసా మహాసభలోనే అఖిలభారత రైతుసంఘం రానున్న కరువు ప్రమాదాన్ని గురించి రైతాంగాన్ని హెచ్చరించింది. సిమ్మల పాకాలలో జరిగిన కార్యవర్గ సమావేశంలో అధికాహారోత్పత్తికి పిలుపునిచ్చింది. ప్రభుత్వంపై ఒత్తిడితేవాలని ప్రజల నుద్బోధించింది. అంతటితో ఊరుకోక దేశంలో రాయలసీమ మొదలైన ప్రాంతాల్లో కరువు వచ్చినప్పుడు నివారణ కృషి ఎంతోచేసింది. ఆ అనుభవంతో ముందుగానే మేల్కొని మిగతాప్రాంతాల్లో కరువు వ్యాపించకుండా అన్ని పార్టీలు, వర్గాలతో కూడిన ఆహారకమిటీలేర్పడి ఆహారసమస్యా కృషిని ముందుకు తీసుకుపోయాయి. కరువు నివారణ విషయంలో ఆంధ్రమహాసభ, దేశభక్త కొండ వెంకటప్పయ్యగారు చేసిన కృషి ప్రశంసనీయం. ప్రజలు తమ ఆహార కమిటీల ద్వారా ఆందోళనచేసి తీవ్రపరిస్థితులు రాకుండా చేసుకోవాలి. ఈ సంవత్సరం రాష్ట్రంలో పంట తగ్గింది. ధాన్యాన్ని పంట కళ్లాల్లోనే వ్యాపారస్తులకే నేస్తున్నారు. ధరలు చాలా పడిపోయి రైతుకు నష్టం కలుగుతోంది. రైతుకు న్యాయమైన రు. 11 ల ధర ముట్టేలా చేసేబాధ్యత ఆహారకమిటీది.

తిండి కరువువస్తే విప్లవాలు వస్తాయనే ప్రచారం ప్రజల గొంతుకోసే ప్రచారం. బెంగాలులో కరువు పాలబడి నలభైలక్షలు చనిపోతే వచ్చింది విప్లవం కాదు—ప్రజలు నిస్పృహచెందారు. నైతికధర్మాలే నాశనమయాయి. ఆదుస్థితి దేశమంతటా వ్యాపింపజేయడమే పై ప్రచారం యొక్క ఆశయం" అని హెచ్చరించారు.

మహాసభకు అధ్యక్షత వహించిన శ్రీ దివాకరుని లక్ష్మీనారాయణగారు తమ ఉపన్యాసంలో ఇలా అన్నారు.

"తాలూకా ప్రతినిధుల రిపోర్టులనుబట్టి చూస్తే ఆహారసమస్య విషయంలోకూడా భిన్నాభిప్రాయాలున్నట్లు తెలుస్తుంది. ఇది చాల ప్రమాదకరం. ఈ విషయంలో ఇలా భేదాభిప్రాయాలతో ఉండి ఐక్యమందా వవలంబించకపోతే ఇక్కడిస్థానికోద్యోగులు కూడా చర్చిల్, అమెరీల్లాగా విజ్రంభిస్తుకొని ప్రజల వాంఛలను కాలదన్నగలరు"

గుంటూరుజిల్లా ఆహారకమిటీ ప్రజలకు కొంత మేలు చేకూర్చింది: ఇంకా చేయవలసిందెంతో ఉంది. జిల్లా అంతటా పంటలు తక్కువగా పండాయి. పండిన ధాన్యం కూడా మిల్లుయజమానుల, వ్యాపారస్తులచేతులలో పోతూండడంవల్ల కొరత ప్రాంతాల్లో ధరలప్పుడే పెరుగుతున్నాయి. మరోవైపు అంటువ్యాధులు తలెత్తుతున్నాయి. ఇతర విషయాల్లో విభేదాలెన్ని ఉన్నా, ప్రజాసేవలో అందరూ ఏకమై కావలసిన అవసరం ఎంతో ఉంది. జిల్లాలోని కాంగ్రెసుదేశభక్తులు అందరూ కూడా గట్టిగా పనిచేయవలసిఉంది. ప్రజాసేవలోనే జాతీయోద్యమం పెంపొందగలదు.

[illegible]

అభ్యుదయ రచయితల మహాసభ జమాఖర్చు

★

18-2-45 వ ద్వితీయాంధ్ర అభ్యుదయ రచయితల మహాసభ ఆహ్వానసంఘ సమావేశమై ఈక్రింది ఆదాయ వ్యయ పట్టికను అంగీకరించినది. సభను జయప్రదముగా జరిపినందులకు, విరాళము లిచ్చినందుకు, పౌరులకు ఆహ్వానసంఘం కృతజ్ఞత తెలియజేస్తూంది.

చెరుకుపల్లి పట్టాభిరామయ్య,
కోశాధికారి.

జమ

విరాళాలద్వారా	1328-12- 3
అప్పు	203 -7-11
మొత్తం	1532-6- 2

ఖర్చులు

ప్రాహ-ఖర్చులు	80-11- 0
ఎడ్వర్ టైజ్ మెంటు	38- 7- 0
లైటింగు వగైరా	89- 9- 9
ఫోటోలు	45- 0- 0
పోస్టర్	23-13- 0
పందిళ్లు, పాకలు	203- 3- 0
భోజనాలు	677-15-11
ప్రయాణం	174- 9- 0
వాలంటీర్లు	37- 0- 0
ప్రింటింగు వగైరా	97-13- 6
చిత్రప్రదర్శనశాల	164-4- 0
మొత్తం 1532-6-2	1532- 6- 2

ఉత్తర విశాఖజిల్లా పిలుపు

కరువు కాటకాలకు ఎరఅయి బాధపడుతూన్న ఉత్తరవిశాఖజిల్లా ప్రజలకు వైద్య సహాయానికి తోడ్పడవలసిందని డాక్టరు వి. గురుమూర్తి (ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆంధ్రబ్రాంచి అధ్యక్షులు) డాక్టరు యం. వి. కృష్ణారావు (పైబ్రాంచి కార్యదర్శి) గార్లు విజ్ఞప్తి చేశారు. విజయనగరం విద్యార్థి కాంగ్రెసుయొక్క కరువు నివారణ కమిటీ కార్యదర్శి శ్రీ కె. యస్. శాస్త్రిగారు రు. 280 లు పంపారనీ, ఇప్పటికి మొత్తం రు. 1100 లు వసూలయిందనీ, కృష్ణారావుగారు తెలుపుతున్నారు. చింతలపూడి సమీపంలో జరిగిన ఒక ఉత్సవంలో కమ్యూనిస్టు వలంటీరుదళం వారు విశాఖజిల్లా కరువు నివారణనిధికి రు 7-1-6లు వసూలు చేశారు.

అత్తిలీ తాలూకా, మల్లాయిగూడెం బాలసంఘ సభ్యులు బుడబుక్కలవేషంతో ఇంటింటికి తిరిగి రు. 8 లు కరువు నిధి ప్రోగుచేశారు. శివపురం గ్రామంలో బాలసంఘ సభ్యులు రు. 5 లు వసూలుచేశారు. ఈ మొత్తంఅంతా విశాఖజిల్లా కరువు నివారణ నిధికి పంపబడింది. ఆంధ్ర ప్రజలు ఇంకా విరివిగా విరాళాలిచ్చి ఉత్తరవిశాఖజిల్లా కరువు నివారణకు తోడ్పడాలి.

కొబ్బరిపంటకు కొన్ని సూచనలు

—శ్రీ స్వామి పాతూరి కోటయ్యగారు

కొబ్బరికాయ మానవుల కన్నివిధాలా వుపయోగించుఫలం. అపక్వాహారులకు ముఖ్యాహారం. దీనిపంటకూడా చాలా సులభమే. దానికై భూమిని ప్రత్యేకించవలసిన అవుసరంలేదు. ఒక కుటుంబానికి 100 కొబ్బరిచెట్లు వుంటే, 400 వందలరూపాయల ఆదాయం చేకూరును. ఆకుటుంబానికి వంటచెరుకు కరువుండదు. ఆకుదళ్ళకు, చాపలకు, ఈనల చీపుళ్ళకు, పీచుత్రాళ్ళకు ఎంతయేని వుపయోగించును.

మాగాణి భూములలో గట్లపైన, దిబ్బల చుట్టును, గ్రామాలలో బజారుల ప్రక్కలను పెరటిచుట్టును, గృహముల ముందును, వేసి కొబ్బరిచెట్లు పెంచవచ్చును. నారింజ, నిమ్మ, మామిడితోటలచుట్టును వేయవచ్చును. ఇంకా ప్రభుత్వం శ్రద్ధతీసుకుంటే, మాగాణి కాల్వలకు గట్ల దిగువను రోడ్ల ప్రక్కలను, వేయించి మైలుజవానులచేత పెంచునట్లు చేయవచ్చును. డి. పి. డబ్ల్యు, వారు.లోకల్ బోర్డువారు కాల్వలకు,రోడ్లకుప్రక్కల ఆహారయోగ్యమైన మామిడి, జామ, కొబ్బరి, పనస మున్నగు ఫలవృక్షములను వేయించి జాగ్రత తీసుకొనినచో, ప్రజలకెంతేని వుపయోగించును. ఆయా డిపార్టుమెంటులకు ఆదాయం చేకూరును.

వేసవికాలం 7-8 అడుగుల లోతులో నీరుండు ప్రదేశమున, సముద్రపుగాలి సోకు ప్రదేశమున, వంద్రుమట్టిగల లంకభూములయందు, గరపనేలలందు కొబ్బరితోట బాగా ఫలించును. దానికి తగిన పరిశ్రమ చేయుచున్నయెడల, సకల ప్రదేశములలోను, కొంచెమించుమించుగా ఫలించును. భూవసతిలేనివారు సైతము 10-12 వృక్షములను సునాయాసంగా పెరటియందే వేసి పెంచవచ్చును.

పెంచేవిధం

కొబ్బరిచెట్టు కాపుకురాగానే 2, 3 ఏండ్లకొకసారి చెట్టు మొదలు చుట్టు 1 గజం వెడల్పున 1 అడుగు లోతున డిశంబరునెలలో త్రవ్వి, కాండము తెగకుండా వేరు పూర్తిగా చెక్కివేయాలి. ఆగోతిలో తాటాకు చీకిన యెరువుగాని, పచ్చిగడ్డి తిన్నపుడు పశువులు విడచిన పేడ యెరువుగాని, గొర్రెల-మేకల యెరువుగాని, చెట్టు 1కి షుమారు 7-8 పల్లికలు వేసి దానిపైని 4-3 శేర్లు వుప్పుచల్లి ఒక బెత్తెడుమందాన మట్టి కప్పాలి. తొలకరివరకు వారానికొకసారి నీళ్లు పోస్తూవుండాలి. ఇంకా ఆగోతిలో పచ్చిజనుము, నేపాళము, రక్కిస కూడా చేర్చుట మంచిది. నేపాళం, పసమూలం, ముక్కలుముక్కలుగానరికి మొదట వేసి మట్టికప్పి తడిపెట్టుతూవుంటే కొబ్బరిచెట్టు త్వరగా పెరిగి కాపుకువచ్చును.

పల్లము భూములలోనున్న చెట్లకు ప్రతి సంవత్సరం మొదలులో పాతికనుండి అరగజమువరకు మట్టితో భూమిని పెంచుతూవుంటే అలా చేస్తున్నంతకాలం వేరు నరుకవవసరంలేదు. కొబ్బరిచెట్టు మొదట యెంత యెత్తునమట్టి పోస్తే అంతయెత్తున క్రొత్తవేరు పుట్టుచు బాగా కాయుచుండును. వేరు నరుకని సంవత్సరములలో, యేడాదికి 2 సార్లు మాత్రం మొదలు చుట్టూ 1 గజం కదల త్రవ్వుతు యెరువు వేస్తుండాలి.

జాగ్రత

మాగాణి గ్రామాలలో 7-8 మాసములు భూమి తేమగానుండును. కనుక జూన్-జులై లగాయతు జనవరి-ఫిబ్రవరి వరకు కొబ్బరి చెట్టుకు నీళ్ళు అవసరం వుండదు. ఆ కాలంలో చెట్టుమొదట వర్షంనీరు నిలువకుండా పాదు పూడ్చవలెను. తేమలేని మిక్కిలి యెత్తుగల చోటునున్న చెట్లకుమాత్రం వరపు కాలంలో అరుదుగా నీళ్ళుపోయాలి. మెట్ట ప్రదేశాలలో మాత్రం అవసరాన్నిబట్టి నీళ్లు పెట్టుచుండాలి.

గృహములముందున్న చెట్లకు వరిఅన్నం తిన్న పాత్రలుకడిగిన నీళ్ళు, గంజి, కడుగు, వరిమెతుకులు, బియ్యము మొదట్లో పడపోయరాదు. వరిగడ్డి చీకిన యెరువు వేయరాదు. మొవ్వును పురుగు కొట్టుతూంటే వుప్పుమూట మొవ్వులో పెట్టాలి.

కొబ్బరి నారు

కొబ్బరిమొక్కలేప్రదేశమున వేసెదరో ఆ ప్రదేశమునకు 50-60 మైళ్ళలోపల మొలపించిన మొక్కలను నాటాలి. ఇంకా సమీపములో మొక్కలైతే మరీ శ్రేష్ఠము. ఒక ప్రాంతములో మొక్కలు, మరొక దూరదేశములో నాటిన యెడల, ఆ రెండు దేశాలకు, వాతావరణం, నీరు, భూమి తేడాలుండుటవల్ల, రవాణా చేయుటలో రోజులు గడచుటవల్ల అవి బ్రతుకుట కష్టము.

కొబ్బరిబొండము బాగా పండని దానిలో మొక్కగాని, పెచ్చు తీసివేసిన కాయలో మొక్కగాని, గాడ్పు కాలములో పెరిగిన బొండాంలో మొక్కగాని, చెట్టు కాపుపట్టిన 10 యేండ్ల లోపల లేత చెట్టుమొక్కగాని, పెంపులోను, కాయుటలోను, శ్రేష్ఠముండదు.

ఎండాకాలంలో కాసినకాపు బొండాలు ముగ్గిరాలేవరకు వుంచవలెను. వాటిని గాలి-వెలుతురుగల చోట 1-2 మాసములు నిలువ వుంచి, 1-2 మాసములు నీటిలో నానవేసి, మెత్తని భూమిలో, అర్ధగజానికొక బొండాం నాటవలెను. అవి 4-5 మాసములకు మొలచును. భూమిలో బొండాము మొలచువరకు తడి అరకుండా వుండాలి. ఆమొక్కల్ని సంవత్సరం అయిన తరువాత 2-3 యేండ్లలోపల తీసి అవుసరమున్నచోట నాటుకోవచ్చును.

మొక్క మొలిచినది లగాయతు, కాపుకు వచ్చి పైకెదుగువరకు, పశువులను లాగనీయరాదు. పెద్దమొక్క అయితే బ్రతికే వరకు కర్రపాతి, గాలి కూగులాడకుండా పెట్టాలి. మట్టలెప్పటికప్పుడు పైకి కట్టుతూ వుండాలి. ఇండ్లముందు, బజారులలోను, బహిరంగభూములలోను, కాల్వ రోడ్ల ప్రక్కలను వెదురుబుట్టలు పెట్టాలి. ఇట్లా జాగ్రతగా కొబ్బరిమొక్కలను పెంచుకుంటే 7-8 యేండ్లలో సమృద్ధిగా కాచి ఫలితమిచ్చును.

ఉపాధ్యాయుల ఇబ్బందుల తీర్చాలి

తిరువూరుతాలూకా ఎయిడెడ్ స్కూళ్ల ఉపాధ్యాయుల మహాసభ కొండూరులో ఫిబ్రవరి 8వతేదీన బెజవాడతాలూకా ఎయిడెడ్ ఉపాధ్యాయుల సంఘ కార్యదర్శియైన శ్రీ కె. శ్రీరాములుగారి అధ్యక్షతను జయప్రదంగా జరిగింది. తాలూకాలోనున్న 59 స్కూళ్లనుంచి 80 ఉపాధ్యాయులు ప్రతినిధులుగా హాజరైనారు. కార్యదర్శి సాంవత్సరిక రిపోర్టు నివేదించిన తర్వాత సభాధ్యక్షులు దేశ పరిస్థితుల్ని గూర్చి, ఎయిడెడ్‌స్కూళ్ళ ఉపాధ్యాయులు అనుభవిస్తున్న కష్టాలను గూర్చి, బోధనాపద్ధతులనుగూర్చి విపులంగా ఉపన్యసించారు. తర్వాత పి. సత్యానందం, యస్. వీరభద్రరావు, కె. ఫ్రాన్సిస్ గార్లు మాట్లాడారు. ఈదిగువ తీర్మానాలు యేకగ్రీవంగా ఆమోదించబడ్డాయి.

1. అధికధరల అలవెన్సు విషయంలో ప్రభుత్వోద్యోగుల కిస్తున్నట్లుగా తమకుగూడా యివ్వాలని కోరారు.

2. జీతాలుచాలక బాధపడుతున్న ఉపాధ్యాయులనుండి మేనేజిమెంటు సమిత్తంరు. 16 లు తీసుకొనడం అన్యాయం కాబట్టి, ఆఖర్చును ప్రభుత్వమే భరించుకోవాలి.

3. 154వ రూలును సాకుగా తీసికొని పై ఉద్యోగులు వ్యక్తిగత ద్వేషంతో సర్టిఫికెట్లు రద్దుచేయుటకు, తప్పుడురిపోర్టులు చేయుటకు అవకాశం ఉన్నది. కావున ఆ రూలును రద్దుచేసి, అపరాధంచేసిన ఉపాధ్యాయులను వేరువిధంగా శిక్షించవచ్చును.

4. చేతిపనులు రాని ఉపాధ్యాయులకు వేసవిలో తరిఫీదు నివ్వాలి.

5. ఉపాధ్యాయులకు నెల 1కి 2 సీసాల కిరసనాయులు, 4 దస్తాల తెల్లకాగితాలు సప్లయి చేయాలి

6. హైయర్ ఎలిమెంటరీ స్కూళ్ళలో సెకండరీ గ్రేడ్ స్కేలుతో ఒక తెలుగు పండితుని నియమించాలి.

7. ప్రతినెలా ఉపాధ్యాయులకు జీతాలు అందేటట్టు చేయాలి.

8. హైయర్ ఎలిమెంటరీ స్కూళ్ళలోని 8వ తరగతి పబ్లికు పరీక్షలో ఉత్తీర్ణులుకాని విద్యార్థుల మార్కులు హెడ్‌మాష్టర్లకు పంపాలి. అలా పంపితే ఉపాధ్యాయులు విద్యార్థుల లోపాలను సరిదిద్దుటకు ప్రయత్నిస్తారు.

9. లోకల్‌బోర్డు ఉపాధ్యాయినుల పిల్లలకు మాధ్యమిక, ఉన్నత విద్యలను ఉచితంగా యివ్వాలని జి. ఓలో ఉన్నది. 'ఉపాధ్యాయుల పిల్లలకుకూడా' అని చేర్చుతూ, ఎయిడెడ్ ఉపాధ్యాయుల, ఉపాధ్యాయినుల పిల్లలకుకూడా అమలుపర్చాలి.

నూతన సంవత్సరానికి పి. సత్యానందం గారు అధ్యక్షులుగాను, ఎలియాగారు కార్యదర్శిగాను, కదియాల సీతారామయ్యగారు సహాయ కార్యదర్శిగాను ఎన్నుకోబడ్డారు.

(10వ పేజీతరువాత) సేనాధిపతి కొడుకుకూడా నిపుణుడవుతాడని సిద్ధాంతంలేదు. మా సేనాధిపతులు మిలిటరీ కళను పరిశోధించి, అవగాహన చేసుకున్నవారు. వారి ఛాతీలపై మెరుస్తున్నవి వారసత్వ చిహ్నాలుకావు; అర్హతను చాటుతూన్న బిరుదు పతకాలు, ప్రతిజ్ఞ, చాకచక్యము మాచేతిలో ఉన్నాయి కాబట్టే మేం విజయపరంపరలను సాధిస్తున్నాం.

జారు సేనల్లోని సైనికుడు సాహసవంతుడే. మాతృదేశభక్తుడే. కాని అతనికి ప్రపంచజ్ఞానం శూన్యం. రెడార్మీ యోధుడు అలాంటివాడు కాదు. దేనికోసం యుద్ధంచేస్తున్నాడో అతనికి తెలుసు. సైనిక దుస్తులు ధరించిన పౌరుడతడు. అతని దేశానికి పాలకులు ప్రజలే - ఆపాలకుల్లో తానొకడు. ఉన్నతాధికారి ఆజ్ఞలను శిరసావహిస్తాడు. కాని ఎందువల్ల? అధికారి రక్తం అతని రక్తంకన్నా శ్రేష్ఠమయిందనే తప్పుడు సిద్ధాంతాన్ని బట్టికాదు. మిలిటరీ డిసిప్లిన్‌యొక్క అవసరాన్ని గుర్తించే అలా శిరసావహిస్తాడు. పారంపర్యంగా రష్యన్ సేనల్లో ఉన్న లక్షణాలే నేటి విజయాలకు కారణమని పండితమ్మన్యు లెవరయినా అంటే - "మీరు నవంబరు విప్లవానికి వ్యతిరేకులు కాబట్టే అలా అంటున్నార"ని మా జవాబు.

తూర్పుప్రష్యాలో టానెన్‌బర్గు నగరం మొన్న రెడార్మీ వశమయింది. లోగడ ఆనగరందగ్గరే జర్మన్లు జారుసేనల్ని ఘోరంగా ఓడించాయి. ఆ సేనలెక్కడ పరాజయం పొందాయో, అక్కడే మేము విజయాలను సాధిస్తున్నాం. విదేశీయులు మునుపటి రష్యాపట్ల అభిమానంచూపుతే మేము వద్దనం. కాని నేటి సోవియట్‌ను పొగడక పోతే పోయె; దానిపట్ల గౌరవం చూపాలని కోరుతాం.

మా విజయ రథానికి సారధి స్టాలిన్ గుండెలెంతో బరువెక్కిన రోజుల్లో ఆయన మమ్మల్ని ఓదార్చేవాడు - మా నగరవీధుల్లో ఆనందం పొంగి పొరలక తప్పదని ధైర్యం చెప్పేవారు. నాజీజర్మనీ గుండెల్లోకి రెడార్మీ బాకుచీల్చుకుపోవడాన్ని ఆయనదూరదృష్టితో ఆనాడేచూడగలిగారు. ఓపెన్ని దాటిపోయాం. త్వరలో బెర్లిన్ నగరవీధులగుండా కదం తొక్కుతూ సాగిపోగలం.

స్వాతంత్ర్య దినోత్సవం నాడు అరెస్టు

స్వాతంత్ర్యదినోత్సవసందర్భములో ఊరేగింపు జరిపినారనే నేరంపై అయినపూరులో స్థానిక కమ్యూనిస్టులైన ఖాదరవల్లి, వీరారెడ్డి, వెంకట్రామరెడ్డి, వెంకటేశ్వర్లు గార్లను అరెస్టుచేసి గన్నవరంసబ్‌జైలులో వుంచారు.

★

కామ్రేడ్ పి. యస్. శర్మ అరెస్టు

రాజమండ్రి యం. యస్. యం. ఎంప్లాయీస్ యూనియన్ బ్రాంచి వారు ఫిబ్రవరి 11వ తేదీన "కరువు భత్యం దినం" సందర్భంలో బహిరంగ సమావేశం జరిపారు. ఆ సభలో రాజమండ్రి రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ ఆర్గనైజరైన కామ్రేడ్ పి.యస్. శర్మగారు ఉపన్యసించారు. ఈ ఉపన్యాసం ఇచ్చినందుకు 19 2 45నడిఫెన్సుఆఫ్ఇండియా చట్టం 38 (5) క్రింద వారిని అరెస్టు చేశారు.

★ విజ్ఞానం - వికాసం

పాముకాటుకు మందు

—★—

"పాము కరిచింది." అంటే "అమ్మో. ఇంకేముంది! బ్రతకడు!" అని గుండె బాదుకోవలసినగతి ఇకవుండదు. ఎలాంటి పాము విషానికయినా విరుగుడుగా ఒక సూది మందు కనిపెట్టారు.

బొంబాయిలోని "హాఫ్కిన్‌సంస్థ" మందులు మొదలయిన వాటిల్లో పరిశోధనలకు ప్రసిద్ధికెక్కింది. ఈ సంస్థలో జరిగిన పరిశోధనల ఫలితంగానే ఈ కొత్తమందు కనిపెట్టారు. మన దేశంలో ఏడాదికి సుమారు 20,000 మంది పాముకాటులవల్ల చనిపోతుంటారు. ఇంతవరకు డాక్టర్లు ఒక సూదిమందు వాడుతున్నారు. కాని అది నాగుపాము, నల్లత్రాచు కాటులకే పనికివస్తుంది. అది రెండేళ్ళకన్నా ఎక్కువకాలం నిలవుండదు. పైగా దాన్ని నిలవవుంచడం చాల కష్టం. కొత్తగా కనిపెట్టినమందు ఇప్పుడు అన్ని విషసర్పాల కాటుకూ పనికివస్తుంది. పదేళ్ళపాటు నిలవవుంటుంది - నిలవచేయడం తేలికవనవని. ప్రతి పల్లెటూరి డాక్టరు కూడా తనవద్ద ఉంచుకోవచ్చు. తెలివి తేటలున్న ప్రతివ్యక్తి. కొద్ది తరిఫీదుతో ఈ మందును ప్రయోగించడం నేర్చుకోవచ్చు.

ఈ మందు అప్పుడే వాడుకలోకి రాలేదు. కొద్దిరోజుల్లో వస్తుంది. అయితే ప్రస్తుతం దీని ధర అధికం. ఒక సూదిమందు ట్యూబు ధర రు. 5 లు. పాముకాటుతిన్న ప్రతివారికి మొదట రెండు ట్యూబులు, ఆపైని అవసరముంటే మరికొంత ఇవ్వాలని దానిని కనిపెట్టిన వారు చెప్పారు. అంటే బీదవారి కందుబాటులో ఉండదన్నమాట. ఈ మందును విరివిగా తయారుచేసి, బీదవారికి కూడా అందుబాటులోకి తేవాలి.

"హాఫ్కిన్‌సంస్థ" వారు 1898లో ప్లేగు మందును కనిపెట్టడం కోసం పరిశోధనలు చేశారు. ప్రపంచంలోకల్లా మొట్టమొదటిసారి ప్లేగుమందు కనిపెట్టింది వీరే. ఆహారపదార్థం కరువుతో ప్రజలు అల్లాడిపోతున్న ఈ రోజుల్లో ప్రజలశక్తి క్షీణించకుండా చేయగల పుష్టికరమైన పదార్థాలను కనిపెట్టడానికి ఈ సంస్థలో పరిశోధనలు జరుగుతున్నాయి.

(విషయం 'ది హిందూ' పత్రికలోనిది)

●

పోలీసు సోదా

★

"ప్యారిస్ కమ్యూన్" అను ఏపేరింత లేని తెలుగు గ్రంథం కొరకై తూర్పుగోదావరిజిల్లా పోలీసు అధికార్లు జిల్లా కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శియైన కామ్రేడ్ మహీధర జగన్మోహనరావుగారి యింట్లో 16-2-45వ తేదీని సోదా జరిపారు. ఏమీర గ్రంథాలేవీ దొరకలేదు.

పార్టీఫండు వసూళ్లు

—★—

క్రిందటి సంచికలో ప్రచురింపబడిన మొత్తం	రు.5558-4-7

గన్నవరం తాలూకా

ఆత్కూరు గ్రామం

శ్రీ తలసీల కృష్ణారావు	140-0-0
,, సూరపనేని రామారావు	25-0-0
,, వడ్డి శేషయ్య	15-0-0
,, అట్లూరి కేశవనారాయణ	10-0-0
,, అన్నే సీతయ్య	10-0-0
,, మాదల గోపాలకృష్ణయ్య	20-0-0
,, సజ్జా రాజారావు	20-0-0
,, ,, సీతారామదాసు	10-0-0
,, అట్లూరు కమలమ్మ	10-0-0
,, మూల్పూరి శివరామయ్య	10-0-0
,, కొడాలి శోభనాచలపతిరావు	10-0-0
,, అట్లూరి రామశేషయ్య	10-0-0
,, ,, సీతారామయ్య (s/o హరియ్య)	25-0-0
,, జి. రామకృష్ణ	10-0-0
,, గుత్తా నరసింహారావు	10-0-0
చిల్లర వసూళ్ళు	17-0-0

ఇందుపల్లి గ్రామం

శ్రీ వెనిగళ్ళ కృష్ణమూర్తి	26-0-0
,, నరసింహారావు	25-0-0
,, కోగంటి రామశేషయ్య	25-0-0
,, జాలాది కోటేశ్వరరావు	25-0-0
,, పాలడుగు నారాయణదాసు	25-0-0
,, కోగంటి రామశేషయ్య	20-0-0
,, నిమ్మగడ్డ నాగభూషణం	20-0-0
,, గద్దే వెంకట సుబ్బయ్య	10-0-0
,, మేనేపల్లి శ్రీరాములు	10-0-0
చిల్లరవసూళ్ళు	13-0-0

కాటూరు

శ్రీ మన్నే వీరయ్య	58-0-0
,, నార్ల ధనుంజయ్య	18-0-0
,, సూర్యదేవర రామబ్రహ్మం	18-0-0
చిల్లరవసూళ్ళు	6-0-0

తేలప్రోలు

శ్రీ భీమవరపు రాజారావు	200-0-0
,, అళ్ళ నారాయణరెడ్డి	100-0-0
శ్రీ పాకలపాటి రామారావు (పొట్టిపాడు)	50-0-0
,, ముక్కామల చిన నాగభూషణం (బుద్ధవరం)	25-0-0
,, ముక్కామల జగదీశ్వరరావు (బుద్ధవరం)	25-0-0
,, వేగే సుబ్బయ్య (అవుటపల్లి)	10-0-0
,, సూరపనేని సుబ్బారావు (ఉంగుటూరు)	30-0-0

తిరువూరు తాలూకా

శ్రీ నల్లమల చిన లక్ష్మయ్య (కొణిజర్ల)	15-0-0
,, దేవభక్తుని లక్ష్మీనరసయ్య	15-0-0
,, గోపాలకృష్ణయ్య	10-0-0
,, కటకం గురవయ్య	10-0-0
,, దేవభక్తుని ఛినసీతారామయ్య	10-0-0
చిల్లరవసూళ్లు	22-0-0
శ్రీ తన్నీరు అంజయ్య, లక్ష్మీనరసమ్మ గార్ల వివాహ సందర్భములో (మిట్టగూడెం)	20-0-0
చిత్తపూరుగ్రామంనుండి	20-0-0

బెజవాడ టౌన్

బెజవాడటౌన్, జోషీనగర్ పేట యువజనసంఘంద్వారా బుర్రకథ సందర్భంలో	20-0-0
రేపల్లెతాలూకా తుమ్మల గ్రామం నుండి బుర్రకథ సందర్భంలో	70-0-0
డాక్టరు అచ్చమాంబగారిద్వారా ఒక సానుభూతిపరునినుండి	100-0-0
మొత్తం	రు. 6961-4-7

బెజవాడ టౌన్ పార్టీఫండు వసూళ్ల వివరాలు

(క్రిందటి సంచికలో బెజవాడ టౌన్‌లో వసూలైన మొత్తం ఇదివరకే ప్రచురించాం.) ప్రజాశక్తి ప్రెస్‌వర్కర్సు	28-4-3
రుక్మిణీకృష్ణ బాయిల్డ్ రైస్ అండ్ ఆయిల్ మిల్	20-0-0
శ్రీ యం. సత్యనారాయణమూర్తి	10-0-0
,, లక్ష్మీవిలాస్ గ్రౌండ్ నట్ ఆయిల్ మిల్సు	10-0-0
,, గుళ్ళపల్లి శ్రీరాములు	20-0-0
,, పాటిబండ భద్రాచలం	10-0-0
,, గోగినేని ఆదినారాయణ	116-0-0
,, బోయపాటి వేంకటకృష్ణారావు	25-0-0
,, గోగినేని సత్యనారాయణ	30-0-0
,, బచ్చు కృష్ణయ్య	10-0-0
,, షా గణపతి దేవరాజ్	20-0-0
,, సేట్ బహూర్‌మల్ నరసింగ్‌జీ	31-0-0
,, భూమా సుబ్బరామయ్య అండ్ పార్ట్నర్సు	30-0-0
,, తెంటు కనకయ్య అండ్ పార్ట్నర్సు	30-0-0
,, చాపరాల సుబ్బారావు అండ్ పార్ట్నర్సు	30-0-0
,, పిళ్ళా అప్పలస్వామి అండ్ పార్ట్నర్సు	30-0-0
,, మహమ్మద్ రసూల్ అండ్ పార్ట్నర్సు	30-0-0
,, షేక్ రంజాన్ అండ్ పార్ట్నర్సు	30-0-0
,, మట్టా కృష్ణమూర్తి అండ్ పార్ట్నర్స్	30-0-0
,, చెన్నుపాటి రామకోటయ్య	15-0-0
,, గరికపాటి వెంకటప్పయ్య	10-0-0
,, పొట్లూరి సూర్యనారాయణ	10-0-0
,, గెల్లి రాజగోపాలం	25-0-0
,, గెల్లి కృష్ణమూర్తి బ్రదర్సు	10-0-0
,, పచ్చవ పాపయ్య	10-0-0
,, పరిచెలి మంగమ్మ	15-0-0
,, చిదిరెడ్డి ఆదినారాయణ, అమ్మణిమ్మ	105-0-0
చిల్లర విరాళాలు	84-0-0
హుండీలద్వారా, జండాల అమ్మకంవల్ల	429-15-4
మొత్తం	1254-7-7

అధికార్ల వింతపోకడ

●

ఒంగోలు తాలూకా రైతుసంఘ కార్యదర్శి యం. కేశవులుగారు ఇలా వ్రాస్తున్నారు.

ఒంగోలులో ఇనుప వ్యాపారస్తుడగు కొప్పురవపు సీతారామయ్య గారు దొంగ మార్కెట్టులో బేరన్ సామాన్లు అమ్ముచున్నారు. రైతుసంఘ వలంటీర్లు కాపలా కాచి, బండితోసహా సామాన్లు పట్టుకొని అసిస్టెంటు కమర్షియల్ టాక్సు ఆఫీసరువద్ద కేసుపెట్టారు. అంతేగాక మాదాల కోటయ్య అను మరియొక రైతుగూడ తాను దొంగ మార్కెట్టులో సీతారామయ్యవద్ద కొన్నట్లుగా ఆ ఉద్యోగివద్ద కేసు పెట్టాడు. దీనితో వ్యాపారస్తుడు భయపడి, 10-2-1945 న దొంగ మార్కెట్టులో అధికంగా తీసుకున్న రూ. 150/లు వాపసు చేశాడు. ఇప్పటికి (11-2-45) కేసుపెట్టి 15 రోజులైనను, విచారణ ప్రారంభం కాలేదు. బోలెడు సాక్ష్యమున్నను, అసిస్టెంటు కమర్షియల్ టాక్సు ఆఫీసరు కేసు విచారించక అశ్రద్ధ చూపడం వింతగా వుంది. కనుక జిల్లా కమర్షియల్ టాక్సు ఆఫీసరుగారు పై రెండు కేసులను విచారించి దొంగమార్కెట్టును అరికట్టాలి.

ఒంగోలు తాలూకాలో ఇనుప వ్యవసాయ పనిముట్లు దొరకడంలేదు. బారనుసామాన్లు, పారరేకులు, కర్రులు, చీల, పట్టాలు ఇలాంటి సామాన్లు స్థానికంగా శ్రీ కొప్పురపు సీతారామయ్యవద్ద, వ్యవసాయశాఖవద్ద ఉన్నా, ఆర్డర్లు రాకపోవడంచేత ఇంతకాలం అమ్మలేదు.

రైతులంతా అవసరాన్ని తెలియజేస్తూ గ్రామ గ్రామాన్నుండి తీర్మానాలు, పెటీషన్లు ఇచ్చారు. పొగాకుసీజను అవడంచేత బారనుసామాన్లు, పట్టాలు తదితర సామాన్లు అత్యవసరంగా కావాలని తెలియ జేశారు. 30-1-45 తేదీనాడు జిల్లా వ్యవసాయాధికారి నుండి అమ్మమని ఆర్డర్లు వచ్చాయి. ఈ విషయం తెలిసి మరుసటిదినం నాలుగైదు గ్రామాలనుండి రైతులు పర్మిట్ల కోసమై స్థానిక డిమాన్‌స్ట్రేటరువద్దకు పోయారు. అధికారి బారనుసామాన్లకు పర్మిట్లిచ్చాడు. పట్టాలరిగిపోయి, అనేక నెలలుగా పొలంపని జరగని రైతులు బండిపట్టాలకు కూడ పర్మిట్లిమ్మని కోరారు. ఆఫీసరు మండిపడి బండి పట్టాలప్పుడే ఇవ్వననీ, ఎప్పుడో ఇచ్చేప్పుడు రమ్మనీ బూకరించాడు. ఇప్పటికే చాలాకాలమైందనీ, మళ్ళిమళ్ళీ తిరగలేమనీ, పట్టాలు కూడా ఇవ్వాలిసిందనీ రైతుసంఘ వర్కరు కె. వెంకటేశ్వర్లు అడిగితే బయటికిపొమ్మని అసభ్యంగా మాట్లాడాడు.

అధికోత్పత్తికై అన్నివిధాలా రైతులకు సహాయపడాల్సిన వ్యవసాయ డిమాన్‌స్ట్రేటరు ఈవిధంగా రైతులపై మండిపడడం, దుర్భాషలాడడం శోచనీయం. జిల్లా వ్యవసాయశాఖవారు, అగ్రికల్చరల్ డైరెక్టరు గారు ఈ ఆఫీసరుపై తగుచర్య తీసుకొని ఇట్టిప్రవర్తనను అరికట్టాలి.

వ్యవసాయ డిమాన్‌స్ట్రేటర్ల అక్రమ చర్యలు

—///—

చీపురుపల్లి తాలూకాలో పంటలు పండక ప్రజలు కరువుకాటకాలకు గురికావడం ప్రభుత్వం గుర్తించి, అధికాహారోత్పత్తికి అవకాశం కల్పించే నిమిత్తం వ్యవసాయశాఖ ద్వారా విత్తనాలు, ఎరువులు అప్పుగానూ, నగదుకూ రైతులకు సప్లయిచేయ నిర్ణయించింది. కాని దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వడన్న సామెతగా, స్థానిక వ్యవసాయ శాఖాధికారులు తమ కర్తవ్యాన్ని నెరవేర్చక, రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. చీపురుపల్లి తాలూకా డిమాన్‌స్ట్రేటరు చేస్తూ వచ్చిన అక్రమాలను గురించి ప్రజలు రైతుసంఘం ద్వారా పై అధికార్లకు తెలియపరచుకుంటున్నా. యింతవరకు అధికార్లు లక్ష్యపెట్టినట్లు తోచదు.

దూర గ్రామాల్లో మధ్యవర్తులద్వారా వరి విత్తనాలను బ్లాకుమార్కెట్టులో అమ్మించడం, వంటచెరుకు ఉచితంగా యిచ్చేవారికి ముందుగా సప్లయిచేయడం, ఆఫీసులో యెన్నడూ హాజరుగాక యింటివద్దనే ఉండడం, సలహాలకై రైతులు యింటికి వెళ్ళితే, వారిని కసరడం - యీ మొదలైన అక్రమ చర్యల కొడిగట్టాడు డిమాన్‌స్ట్రేటర్‌గారు.

పై విషయాలను శ్రీకాకుళం వ్యవసాయ శాఖవారికి తెలుపగా, డిమాన్‌స్ట్రేటరుగారి చర్యను సమర్థిస్తూ సమాధానమిచ్చారుగాని, ప్రజల మొరపాటించనేలేదు. డిమాన్‌స్ట్రేటరు చదువురాని రైతులవద్దకు వెళ్ళి, అప్పులు, విత్తనాలు కావలసినవారు సంతకాలు చేయండని తెల్లకాగితంపై వేలిముద్రలు వేయించి, వెనుకప్రక్క తన యిష్టంవచ్చిన విషయం వ్రాసుకుని ఆఫీసర్లకు అనుకూలమైన సమాధాన మిచ్చుకుంటున్నాడు.

అధికాహారోత్పత్తికి, తద్వారా దేశరక్షణకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న యీ డిమాన్‌స్ట్రేటర్ చర్యలను ప్రభుత్వం తక్షణమే విచారించి, రైతులకు అన్నివిధాలా సహాయం అందివ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

★

బాదరాల అనే గ్రామం చింతలపూడి తాలూకాలోనిది. గ్రామ రైతులు తాలూకా వ్యవసాయ డిమాన్‌స్ట్రేటరుగారికి యెరువుల కొరకై అప్పుల దరఖాస్తులు దాఖలుచేసున్నారు. దరఖాస్తులు శాంక్షన్ అయిన వేమో కనుక్కొనుటకు యెన్ని పర్యాయాలు డిమాన్‌స్ట్రేటరు చుట్టుతిరిగినా, రేపురా, మాపురా అని రైతులను నానాబాధ పెడుతున్నారు. రైతులు తమ వ్యవసాయపు పనులన్నీ మానుకొని, అమూల్యమైన కాలాన్ని వృథాచేసుకోవలసి వస్తోంది.

ఇద్దరు రైతులు, తాము దాఖలుచేసుకున్న దరఖాస్తులు సకాలంలో మంజూరుకానందున, వాటివిషయం క్రమంగా మరచిపోయి, తమ పనుల్లో నిమగ్నులై ఉన్నారు. దరిమిలాను వారి అప్పులు మంజూరీ అయినాయి. కాని, ఈ విషయం రైతులకు డిమాన్‌స్ట్రేటరు తెలియపరచలేదు. అప్పుతీసుకొనకపోయినా, తీసుకొన్నట్టుగా వీరివద్ద డబ్బు వసూలుచేయమని ప్రభుత్వం గ్రామమునసబుకు తాఖీదు పంపింది. తమకు జరిగిన అక్రమాన్ని గురించి విచారణ జరపవలసినదిగా రైతులు పై అధికార్లకు అర్జీలు పెట్టుకున్నారు.

ఈ డిమాన్‌స్ట్రేటరే, ముగ్గురు రైతులు రైతుసంఘం తరపున బండిపట్టాలకు దరఖాస్తు పెట్టుకుంటే, పట్టాలు లేవని సమాధానం చెప్పి, పలుకుబడిగల ఒకరైతుకు పట్టాలు యిప్పించాడు. రైతుల యోగక్షేమం విచారించి, వారికి తోడ్పడ్డానికి బదులుగా, యీ డిమాన్‌స్ట్రేటరు వారికి కంటకంగా ప్రవర్తించడం సహించరానిది. ఇప్పటికైనా ప్రభుత్వం యీ విషయాలలో జోక్యం కల్గించుకొని రైతులకు క్షేమదాయకమైనవిధానాన్ని అవలంబించేట్టు చేయాలని కోరుతున్నాము.

★

ధర్మవరం తాలూకాలో పంటల నష్టం

యగవపల్లి (ధర్మవరం తాలూకా, అనంతపురం జిల్లా) గ్రామరైతుసంఘాధ్యక్ష, కార్యదర్శులు యిలా ప్రకటిస్తున్నారు:

ధర్మవరం తాలూకా కనగానపల్లి, రామగిరి ఫిర్కాలలో యీ సంవత్సరం పంటలు పూర్తిగా నాశనమైనవి. జొన్నలు 2 అణాలు పంటైనా పండలేదు. కొర్రపూర్తిగా ఎండిపోయినది. వేరుశెనగ అగ్గితెవులు తగిలి, నాశనమైనది. అర్ధపదునులో వేసిన ఉలవ అపలేకాపు. కూలిలేక కూలీలు గ్రామాలు విడిచి బెంగుళూరు, యలవంకము వలసవెళ్ళి పోవుచున్నారు. రైతులు యీరెండు మూడు సంవత్సరాలుగా దెబ్బతిని, కోలుకోలేని స్థితిలోఉన్నారు. చాలా మంది పశువులను అమ్మివేయుచున్నారు. ముంగారిలో సేద్యము ఏవిధముగా చేయాలో తోచకుండా ఉంది. ఈ కష్టాలన్నియును కలెక్టరుకు, డిప్టీకలెక్టరుకు, రెవిన్యూ బోర్డు మెంబరుకు, అర్జీలు, తీర్మానాలు, రాయబారాలద్వారా తెలుపుకొన్నాము. స్థానికాధికారులు యీ ప్రాంతములోని రైతులు, రైతు సంఘాలు పెట్టుకొన్నారనే కక్షతో వారిని అణగద్రొక్క వలయునని 0-6-0, 0-8-0 పంట వ్రాయుచున్నారు. రైతులు అంతోయింతో ఏమైనా ముట్టజెప్పితే గాని, అనుకూలంగా వ్రాయడం లేదు. పైఅధికారులే యీ ప్రాంతమును అజమాయిషీ జేసి కరువు పరిస్థితులను కనుగొని, బీదరైతాంగాన్ని కాపాడవలసియున్నది. కూలీలకు కూలిపనులు పెట్టించుటకుతాలూకాలో మైనర్ ఇరిగేషన్ వర్క్సు ప్రారంభించవలసియుంది.

అ. భా. రైతుమహాసభ ప్రతినిధులు

9వ అఖిలభారతరైతుమహాసభ(బెంగాల్)కు వెళ్ళగోరు ప్రతినిధులూ, ప్రేక్షకులూ, 5-3-45 లోగా ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం ఆఫీసుకు తెలియజేయాలి.

---

8 వ ఆంధ్రరాష్ట్ర రైతుమహాసభ, తెనాలి

★

మార్చి 28, 29

ఆహ్వానసంఘం: అధ్యక్షుడు

రావి చినఅమ్మయ్యగారు

ఉపాధ్యక్షులు

వావిలాల గోపాలకృష్ణయ్యగారు

మోర్తల అమరారెడ్డిగారు

కార్యదర్శి

కొల్లా వెంకయ్యగారు

కోశాధిపతి

వాసిరెడ్డి శివలింగప్రసాద్‌గారు

మరి 45 గురు ప్రముఖులు

విరాళములకు విజ్ఞప్తి

50,000 మంది ప్రజలు సమీకరించబడువప్పుడు అన్ని సౌకర్యములూ సమకూర్చుటకు వీలుండుటకై మహాసభను దుగ్గిరాల నుండి మార్చి తెనాలిలో జరుపుటకు తీర్మానించబడెను.

ఆహ్వానసంఘ సమావేశమునకు హాజరైనవారు అత్యుత్సాహంతో ఇచ్చిన విరాళాలలో ముఖ్యమైనవి:

బాలేమర్రు మహిళాసంఘం పత్తిగుల్లకోసి తెచ్చినకూలి.	1-3-0
బండ్లముటా కార్మికసంఘ సభ్యుడు ఆదెయ్యగారు ఒకరోజుకూలి.	2-0-0
దావులూరు గ్రామ రైతుసంఘం	600-0-0
పటిదెం గ్రామ రైతుసంఘం	200-0-0
దాచేపల్లి గ్రామ రైతుసంఘం	50-0-0
కర్ణం రంగారావుగారు	116-0-0
పమిడిపాడు గ్రామ రైతుసంఘం	100-0-0
ఉప్పుగుండూరు ,,	150-0-0
లోకం రాఘవయ్యగారు	50-0-0
గుంటూరులోని వర్తకులు	145-0-0
కోటపాటి అప్పలదాసుగారు	50-0-0
ఖాసిం సాహెబ్‌గారు	(కందులబస్తా)
బొద్దు నాగిరెడ్డిగారు, తిరుమలశెట్టి శీతారామయ్య వగైరా	50-0-0, చాటాకు 3000
లాష సుబ్రహ్మణ్యంగారు	4 బండ్ల కర్ర
కొత్త రామక్రిష్ణయ్యగారు	2 ,,
వెలమకన్న శ్రీధరశర్మగారు	4 తుమ్మచెట్లు, 1 మణుగు మిర్చి, 10 మానికల పెసలు
వినుకొండ తాలూకా రైతుసంఘం	20-0-0
పల్నాడు తాలూకా రైతుసంఘం	25-0-0

ఇంకనూ అనేకమంది విరాళములను ఇచ్చారుగాని స్థలాభావముచే ప్రకటించుటలేదు.

రైతుపుద్యమాభిమానులందరూ విరివిగా ధనవస్తురూపేణ విరాళము లిచ్చిన్నీ, తదితర రూపములలో సహాయము చేసిన్నీ మహాసభను దిగ్విజయంగా జరుప గోర్తాము.

ఇట్లు,
ఆహ్వాన సంఘం.
8 వ ఆంధ్రరాష్ట్ర రైతుమహాసభ.

రైతుమహాసభలు

9 వ అఖిలభారత రైతుమహాసభ - నేత్రకోన
మైమన్‌సింగ్‌జిల్లా (బెంగాలు)
ఏప్రిల్ 7,8

6 వ ప. గో. జిల్లా రైతుమహాసభ - జిన్నూరు.
మార్చి 22,23

5 వ తూ. గో. జిల్లా రైతుమహాసభ - ర్యాలి.
మార్చి 24,25
అధ్యక్షులు :— నండూరి ప్రసాదరావుగారు
ప్రారంభకులు :— యస్. వి. పరులేకర్ ఎం. ఎల్. ఏ., బొంబాయి

కర్నూలుజిల్లా రైతుమహాసభ-వెలుగోడు
మార్చి 5
అధ్యక్షులు :— పి. సుందరయ్యాగారు (సి. కె. సి. సభ్యుడు)
ప్రారంభకులు :— వావిలాల గోపాలకృష్ణయ్య (ఎ. ఐ. కె. సి. సభ్యుడు)
పతాకోత్సవం :— తరిమెల నాగిరెడ్డిగారు (అనంతపురంజిల్లా రైతుసంఘాధ్యక్షులు)

చిత్తూరుజిల్లా రైతుమహాసభ - కమ్మపల్లి (పుత్తూరుతాలూకా)
మార్చి 2
అధ్యక్షులు :— పి.సుందరయ్యగారు
ప్రారంభకులు :— వావిలాల గోపాలకృష్ణయ్య

అనంతపురంజిల్లా రైతుమహాసభ - కొత్తచెరువు. (బుక్కపట్నం)
మార్చి 20
అధ్యక్షులు :— అ. వెం. సీతారామారావు (కృష్ణాజిల్లా రైతుసంఘాధ్యక్షులు)

యస్. వి. పరులేకర్, M. L. A. (బొంబాయి) అఖిలభారత కిసాన్‌సభ కోశాధిపతి: సర్దార్ పృథ్వీసింగుగార్లు ఉభయగోదావరుల, రాష్ట్ర మహాసభలకు వచ్చుటకు అంగీకరించారు.

అర్థూ అపూ లేని చరిత్ర రథచక్రాం తరుగు మా విజయయాత్ర. ఓపెల్న్ వశమయింది - కొనిగ్సుబర్గు చేతి కందొచ్చింది. అదిగో డాన్జిగ్! మా అగ్రదళాలు బెర్లిన్నే సమీపిస్తున్నాయి. జర్మన్లు బెంబేరెత్తిపోతున్నారు; వాళ్ళ ముతా నాయకులీ విషయాన్ని దాచనయినా దాచుకోలేకుంటున్నారు. నాజీ పత్రికాశాఖాధికారి సుందర్మన్, నాజీ మిలిటరీ వ్యాఖ్యాత డిట్మర్ చేసిన ప్రకటనల కిట్టొకటి నాముందుంది. ఎన్ని ఆశ్చర్యార్థకాలు - ఎన్ని గీట్లు. ఒక్కొక్క ఆశ్చర్యార్థకం ఒక్కొక్క బొబ్బరింత; ఒక్కొక్క గీటు వారి గుండెదడకొక చిహ్నం.

"కష్టపడి కట్టుకొన్న కొంపను కాస్తా తుపాను ఎత్తుకుపోతే ఎంత తల్లడిల్లిపోతారో అంత తల్లడిల్లిపోతున్నాం మేము" —డాక్టరులే.

"ఇంకేముంది - వీధిరణాలే ఇక శరణ్యం!" — సుందర్మన్.

"పరిస్థితులు అతి ప్రమాదకరంగా ఉన్నాయి. కత్తిమీద నడుస్తున్నామనుకో. వాలి అక్కడక్కడ మిగిలిపోతూన్న దీవుల్ని (చుట్టుముట్టబడిన సేనలు) మహాప్రవాహం ముంచెత్తేస్తూంది. మనమీదికే పొంగుకొస్తూంది. మధ్యజర్మనీలోనివారికి నిన్న మొన్నటివరకు కలలోని కబురుగా ఉండిన ప్రమాదం నేడు ఎట్ట ఎదుటే ప్రత్యక్షమయింది. విజయమో, వినాశమో తప్ప గత్యంతరం లేదు!" — డిట్మర్.

వేరేగతిలేదు

"విజయం" - ఇంకా వెర్రివాగుడు. జర్మన్లకే నవ్వుపుట్టిస్తుంది. వాళ్ళకిక వినాశం తప్ప వేరే గతిలేదు.

"ఇప్పుడు జరుగుతూన్న మహాసంఘటనలవల్ల నాకు ఆలోచించడానికే వీలుచిక్కటంలేదు."—అన్నాడు డాక్టర్ లే నిర్మోహమాటంగా. సహజం. ఆకిరాతుడు ఇదివరకెన్నడూ దేనిని గురించీ ఆలోచించిన పాపాన పోలేదు. దొంగతనాలకు, వాళ్ళమీదా వీళ్ళమీదా దూకు కరదల్లడానికి అందెవేసిన చెయ్యి వాడిది. రెడార్మీ కురిపిస్తున్న మొట్టికాయలతో ఆ ఉన్న బుర్రకాస్తా వొట్టిపోయింది.

నాడు - నేడు

ఇక సాధారణజర్మన్ పౌరుని సంగతివేరే చెప్పాలా? వాళ్ళు వ్యాసాలు రాయరు. వీధి రక్షణల గోల వాళ్ళకక్కరలేదు. పొంగుకొస్తున్న ప్రవాహం గురించికూడా అంతగా మాట్లాడరు. ఒక్కటే ఆలోచన - ఒక్కటే దృష్టి - ఎక్కడికి పారిపోవడం? ఎటుదారి? దేశపటాలను వెతకడం ప్రారంభించారు—తల దాచుకోడానికేదయినా రక్షిత ప్రదేశంకోసం. మూడేళ్ళక్రిందట కూడా వీరు దేశపటాలు వెతికారు. కాని, దేనికోసం? యూరల్ పర్వతాల దృశ్యాలకోసం, కాకసస్ ప్రాంతం విహారం కోసం - మెసపొటేమియా, ఈజిప్టు దేశాల భోగట్టాకోసం. ఈ ప్రదేశాలవన్నిటినీ పొట్టబెట్టుకొని, వాటి సిరిసంపదలను కొల్లగొట్టాలనే దుర్బాహంతో గుటకలువేస్తూ మరి వెతికారు దేశపటాలను. వీరాధివీరులమంటూ విజయయాత్రలకు బయలుదేరిన మూక ఈనాడు చిట్టెలుకల్లాగా కంతలకోసం వెతుకులాడుతున్నారు.

నాలుగేళ్ల అబద్ధాలాడారు

తూర్పున దాపుదెబ్బలు తింటున్నా — పడమట బింకం చూపడానికే జర్మన్లింకా ప్రయత్నిస్తున్నారు. అక్కడకూడా చావు తప్పడంలేదు. కాని జర్మన్లవాగుడు గురించే

సోవియట్ విజయాలకు కారణమేమిటి?

●

విషప్రచారకులకు ఎహ్రెన్బర్గు సమాధానం

[జర్మన్లు ఒకవైపు తూర్పురంగంలో తోకముడిచి పరుగెత్తుతూ, మరోవైపు పడమటిరంగంలో మిత్రసేనలను తీవ్రంగా ప్రతిఘటిస్తున్నందుకు "ఆంధ్రప్రభ" సంపాదకులు ఈనెల 2 వ తేదీ తమ సంపాదకీయంలో లెక్కలేని ప్రశ్నార్థకాలు కురిపించారు. చివరకు, "దీనికికారణం శక్తిలోపమైనా కావచ్చును లేక మిత్ర రాజ్యాలకంటె రష్యమలే మేలని జర్మన్లు భావించడంవల్లనైనా కావచ్చును. ఇదేదో చిదంబర రహస్యంగా ఉంద"ని తేల్చారు. రష్యనులపట్ల నాజీ జర్మన్లకు సదభిప్రాయం కలుగవచ్చునని, ఆ కారణంచేత తమదేశాన్ని, పరిశ్రమల్ని తమ సైనికుల్ని రష్యన్లకు కానుకలిస్తూ ఆహ్వానించవచ్చునని ఈనాడు ఎవరైనా సూచిస్తే పసిబిడ్డకూడా నవ్వు వస్తుంది. అయినా 'ఆంధ్రప్రభ' సంపాదకులు అలా సెలవిచ్చారు. ఇలాంటి వారు వీరొక్కరే కాదు. ప్రపంచమంతటా ఉన్నారు. సుప్రసిద్ధ సోవియట్ విలేఖరి ఇల్యాఎహ్రెన్బర్గు వీళ్ళకు సమాధానమిస్తూ ఈవ్యాసం రాశారు]

చెప్పదలచుకున్నాను. ఏమీ చెక్కుచెదరనట్టే పడమటిరంగంలో వీరు నటిస్తున్నారు. ఆ రంగంలో ఈనాడు వాళ్ళ ఎత్తుగడలన్నీ బెల్జియం నగరాలను స్వాధీనం చేసుకోవడం కోసం కాదు. బ్రిటిష్, అమెరికన్ మిలిటరీ వ్యాఖ్యాతలను బుట్టలో వేసుకోవడం కోసమే వీరి పన్నాగమంతా. సంతోషంతో ఈబుట్టలో పడదలచుకున్నవాళ్ళు దొరక్కపోలేదు. "ముందుగా నిర్ణయించుకొన్న ప్లానుప్రకారమే జర్మన్లు వెనక్కి వస్తున్నా"రని ఈ వ్యాఖ్యాతలు తూర్పురంగం గురించి రాస్తున్నారు; ఈయుద్ధంలో మమ్మల్నిగురించి వీరు రాసిందంతాచూస్తే "ఇంతఅమాయకత్వమా? నాలుగేళ్లపాటు పచ్చి అబద్ధాలుతప్ప మరొకటి రాయనివారి వ్యాఖ్యానాలను ఇంకా ఎలా చదవగలరు?"—అని ఆశ్చర్యపోతుంటాను. కొన్ని పత్రికలు రష్యానొక "మట్టి పాదాల మహావిగ్రహంగా" వర్ణించాయన్న సంగతిని బ్రిటిష్, అమెరికన్ పాఠకులు మరచిపోయారా? జ్ఞాపకమే ఉన్నట్టయితే ఆ వ్యాఖ్యాతల దగ్గరకువెళ్ళి "ఏమయ్యా! మట్టిపాదాల మహావిగ్రహమే అయితే అరష్యా ఈనాడు విస్తులా నదినుండి ఓడర్ నదివరకూ ఎలా అంగలువేసుకుంటూ సాగలిగింది" అని నెత్తివాచేలా అడగాలి. మాస్కో పతనం తప్పదని వ్యాఖ్యానించారీ రాతగాళ్లు. మాడు పేరయినా పెట్టుకోకుండా 'బెర్లిన్ పతనం తప్పద'ని, ఈనాడు రాస్తున్నారు.

పెద్దమనుషుల ధోరణి

ఫ్రాన్సులో దిగడంకోసం మూడేళ్ళపాటు మహాకృషి సాగించారు మిత్రరాజ్యాలవారు. జర్మనీబలాన్ని చూచి, మిలిటరీ దృష్టితో ఇంతకాలం కృషిచేయవలసివచ్చిందన్నారు పై వ్యాఖ్యాతలు. మూడేళ్ళపాటు విధివిరామం లేకుండా సమరం సాగించిన రెడార్మీ పోలెండులోని దుర్భేద్యమైన జర్మన్ వ్యూహాన్ని భేదించగల సన్నాహాలకోసం నాలుగునెలలు ఆగింది. కలం జాడించారు ఈ వ్యాఖ్యాతలు — రాజకీయ కారణాంచేత రెడార్మీ ఆగిందన్నారు. సన్నాహాలు పూర్తిచేసుకొని బెలొరష్యాలో రెడార్మీ ముందుకురికేసరికి - "ఆఁ, జర్మన్ సేన అలసిపోయింది. అందుకే వెనక్కి వస్తూంది. ఆఁతేగాని రెడార్మీ ఊడ కొరికిందేమీ లేద"న్నాయి కొన్ని మిత్రపత్రికలు. బెల్జియంలోను, ఆర్డినెస్ రంగంలోను, జర్మన్లొక యాభైమైళ్ళు ముందుకు వెళ్ళారు.

"అయ్యోబాబోయ్! జర్మన్ సేనల శక్తి చెప్ప తరంకాదు!" అని యీ పత్రికలే వ్యాఖ్యానించాయి. ఇప్పుడు రెడార్మీ శరవేగంతో ముందుకుసాగడం చూచి ఇవి దిగ్భ్రమ చెందుతున్నాయి. "లాట్జ్, ఓపెల్న్ లాంటి చిన్నచిన్న ప్రదేశాలను జర్మన్లే రష్యన్లకు కానుకయిచ్చారేమో"— అనే అనుమానాన్ని పాఠకుల్లో నాటజూస్తున్నాయి. మేము ఆగినా తప్పే-ముందుకుసాగినా తప్పే-ఇదీ ఈ పెద్ద మనుషుల ధోరణి. అసలు రెడార్మీ సాగిస్తున్నది జర్మన్లతో యుద్ధంకాదా — ఈ విదేశ విలేఖరులతో తగాదాయేనా అన్నట్లుంటుంది ఈ రాతలు చూస్తుంటుంటే.

మిత్రసైనికుల జేజేలు

కాని వీళ్ళరాతలెలాంటివైనా బెర్లిన్పై రెడార్మీపరుగుకు అడ్డుపడలేవు. 'డెయిలీ టెలిగ్రాఫ్', 'న్యూయార్క్ టైమ్సు' పత్రికల్లోని వ్యాఖ్యానాలకు జవాబివ్వడం కాదు మాపని. అంతకన్నా గొప్పకార్యం సాగిస్తున్నాము - అంతిమవిజయం సాధిస్తున్నాము.

పడమటి రంగంలోని మిత్రసైనికులు కొందరు సంతోషంతో మా విజయాలకు జేజేలు కొడుతున్నారని అక్కడి యుద్ధవిలేఖరులు రాస్తున్నారు. మాస్కోలోని విజయ ఘోషలను చెవులారా వినడానికి వారు ప్రతి సాయంత్రం రేడియోచుట్టూ మూగుతారట. ఎదుట వున్న శత్రువుపై తమ ఫిరంగులనుకూడా పేల్చి ఆవిజయఘోషలతో శృతి కలపాలని వారు ఉవ్విళ్లూరు తున్నారేమో! "తూర్పు, పడమర రంగాల్లో మనం యుద్ధంచేస్తున్నాం. మననాయకుని పుణ్యమాఅంటూ అంతా నవ్యంగానే ఉంది." అని జర్మన్ పత్రికలు. పడమటిరంగాన్నిచూపి, బెంబేరెత్తిపోతూన్న తమ పాఠకుల్ని బుజ్జగింపజూస్తున్నాయి. కాని ఈవిషయంలోకూడా పొరబడుతున్నారు. పడమటి రంగంలో జర్మన్ సైనికులిప్పుడంత ఎక్కువగా లేరని రాయటర్, అసోసియేటెడ్ ప్రెస్ విలేఖరులు వ్రాస్తున్నారు. ఆర్డినెస్ రంగంలోని జర్మన్ సైనికుల్ని మరోచోటికి మరలిస్తున్నారు- బెల్జియమునకు కాదు, బ్రెస్లో రంగానికి, డాన్జిగ్ ప్రాంతాలకు. బహుశా ఈ మరలింపు పూర్తిఅయ్యాక బ్రిటిష్, అమెరికన్ సేనలు ముందుకు సాగవచ్చు. మిత్రసేనల ముందున్న మెయిన్ నదిమీద ఒక ఫ్రాన్క్ఫర్టు ఉంది. రెడార్మీ చేరుకున్న ఓడర్ నదిమీద కూడా ఒకఫ్రాన్క్ఫర్టుఉంది. దీనిపని రెడార్మీ తొందరగా పడితే, దానిపని పట్టడానికి మిత్రమండలి పూనుకోవచ్చు.

మిత్రప్రజల తహతహ

శాంతినిలయాలయిన తమ పట్టణాలు నాజీ బాంబులకు గురికావడం అనుభవించారు బ్రిటిష్ప్రజలు—వాళ్ళ హృదయాల్లో రగులుతూన్న కోపాగ్ని నేనెరుగుదును. అన్యాయాన్ని సహించని అమెరికన్ల ఉత్తమభావాలు నాకు తెలుసు. ఫ్రెంచివారిక్రోధం నే నెరుగుదును. బెర్లిన్పైకి కమ్ముకురావాలనే వీరందరి తహతహ. బెర్లిన్మధ్యగుండా ఒక రైలుమార్గ ముంది. దానిమీద తూర్పుచివరను 'సైలీషియా స్టేషన్' ఉంది. మా దృష్టి దానిమీద ఉంది. పశ్చిమచివరను, ధనికులు నివసించే చక్కటి ప్రదేశంలో 'చార్లటెన్బర్గు స్టేషన్' ఉంది. మిత్రమండలికిది నచ్చగలదు.

ఆలోచించండి

మా విజయయాత్రలో ఒక విశేషముంది. శత్రువుల, మిత్రుల మెదడులకు ఎంతైనా పని ఇవ్వగల విశేషమది. "తమ తల్లిగడ్డమీద ఉన్నంతసేపు రష్యన్ సేనలదే పైచేయి. అది దాటి బయటికివస్తే ఆసేనలు నిర్వీర్యమయిపోతాయి" అని వివిధదేశాల మిలిటరీ నిపుణులు బల్లగుద్ది మరీ చెప్పారు. రెడార్మీ ఇప్పుడు అన్యదేశాల్లో సమరం సాగిస్తూంది. కార్పేథియన్ కనుమలు, సైలీషియా పట్టణవీధులు, తూర్పు ప్రష్యా సరోవరాలు మా ఫిరంగి గర్జనలతో మారుమ్రోగుతున్నాయి. శక్తిసామర్థ్యాల్లో, చాకచక్యంలో ఏలాంటి కొరతా లేదే! పాత పుక్కిటిపురాణాలను వదిలి — రంగద్దాలు మూలబెట్టి మమ్మల్ని చూడండి; మా యదార్థస్వరూపాన్ని పరిశీలన దృష్టితో చూడండి; మాప్రజల నేటి నిత్య జీవితాన్ని, ఈనాడు మేము సాధిస్తున్న వాటిని బట్టి మాకు విలువకట్టండి.

పుస్తకాల్లో కనబడే పాత్రకాదు రెడార్మీ. అదొక శక్తివంతమయిన ఆధునిక సేన. తల్లిగడ్డమీదనేకాదు. అన్యదేశాల్లో నిల్వానికూడా మాతృదేశరక్షణను కొనసాగించగల శక్తి అది. మా చరిత్రలో ఎన్నెన్నో విషయాలు ఇతర ప్రపంచానికి అయోమయంగా ఉండేవి. పీటర్ రాజు, టాల్స్టాయ్, నవంబరు విప్లవం, మాగ్నిటాగార్స్క్ - ఇవన్నీ విదేశీయులకు వింతలు. ఇప్పుడు మా విజయాలను చూచి అలాగే ఆశ్చర్యపోతున్నారు. గత యుగాల అంధకారంలోంచి బయటపడి మేము రాయడం, కట్టడాలు నిర్మించడం, యుద్ధంచేయడం నేర్చుకున్నామన్న విషయాన్ని గుర్తించలేదంటే, ప్రపంచం నిద్రావస్థలో ఉందన్నమాట. నేటిపరిస్థితుల కనుగుణ్యంగా యుద్ధం చేయడం నేర్చుకున్నాం కాబట్టే ఈనాడు ఈ విజయాలను సాధిస్తున్నాం. రెక్కలబాంబులను విసిరి వంటలక్కలను దేజారెత్తించం. శ్రేష్ఠమయిన ఫిరంగులు, జర్మన్ల 'పెద్దపులి' టాంకుల్నికూడా మేకపిల్లలను చేయగల కొత్తటాంకులు, ఎదురులేనియుద్ధవిమానాలు - వీటితోనే మేము మా విజయయాత్రసాగించగలం. చాకచక్యము, విజ్ఞానసంపదగల సేనాధిపతుల చేతుల్లో ఉన్నాయి మా రెడార్మీ సేనలు.

అక్టోబరు విప్లవసంతతి

మిలిటరీకళ ఒకవర్గంయొక్క సొత్తుగా భావిస్తారు జర్మన్లు. ప్రజ్ఞ, సామర్థ్యాలు వారసత్వ ఆస్తికాజాలవు; బిరుదులు, రోగాలు కాగలవుగాని. జర్మన్ సేనాధిపతుల కొడుకులుకూడా సేనాధిపతులే అవుతారు; కాని ఒక నిపుణుడయిన (మిగతా 8వ పేజీలో)

కంచుకాగడా

మూరెడు ముందుకు గంతువేయడం, బారెడు వెనక్కి పరుగెత్తడం రంగాగారికి మామూలు. అనాలోచితంగా స్టేటుమెంటులు యివ్వడం, ప్రమాణాలు తయారుచేయడం, ఉపసంహరించుకోడంలో వారు దిట్టలు.

1930 ఉప్పుసత్యాగ్రహం రోజులు. గుడివాడలో పోలీసులు ప్రజలపై తుపాకులు కాల్చారు. ప్రొఫెసర్ రంగా ప్రభుత్వచర్యను నిరసించుతూ ప్రకటన చేశారు. పచ్చయప్ప కళాశాల అధికారులు రంగాపై ఒత్తిడి తెచ్చారు. రంగాగారు రాజీనామా యిచ్చి బయటపడాల్సి వచ్చింది. ప్రజలు సంతసించారు.

ఇంతలోనే కాంగ్రెసుపిలుపును అనుసరించి శాసనసభలలోని కాంగ్రెసువాదులు రాజీనామా యిచ్చారు. ఢిల్లీ అసెంబ్లీ సభ్యులైన ప్రకాశం గారి స్థానం ఖాళీ అయింది. వెంటనే ఆ స్థానంలోకి రంగాగారు గంతువేశారు. సత్యాగ్రహోద్యమం ప్రజ్వరిల్లుతున్న రోజుల్లో రంగాగారు ఎన్నికలకు నిలబడటం కాంగ్రెసువాదులకు కష్టమనిపించింది. రాజీనామాయిచ్చినందుకు అభినందించినవారు యిందుకు రంగాగారిని ఆక్షేపించారు.

తరువాత శాసనసభలు రద్దయి జనరల్ ఎన్నికలు వచ్చాయి. రంగాగారు కృష్ణా - గోదావరి నియోజకవర్గంలోను, గుంటూరు - నెల్లూరు నియోజకవర్గంలోను కూడ నామినేషన్ వేశారు. కృష్ణా - గోదావరిజిల్లాల స్థానంలో రంగాకు పోటీ మోతే నరసింహారావు. గుంటూరు - నెల్లూరు స్థానంలో పోటీగా పాములపాటి వెంగట కృష్టయ్య, గోవిందరెడ్డిగార్లు నిలబడ్డారు. కృష్ణా - గోదావరీ స్థానంలోనుంచి ఎన్నుకోబడటానికి అపుడు రంగాగారికి చక్కని అవకాశముంది. కాని రంగాగారు అచటినుంచి ఉపసంహరించుకొన్నారు. గుంటూరు - నెల్లూరు స్థానానికి పోటీచేసి ఓడిపోయారు.

కృష్ణా - గోదావరి నియోజకవర్గం నుంచి రంగా ఉపసంహరించు కున్నందుకు చిత్రవిచిత్రమైన వదంతులు బయలుదేరాయి. పెద్ద మొత్తం ముట్టిందనీ, తత్ఫలితమే ఉపసంహరణ అనీ వార్తలు అపుడు జైళ్ళలోవున్న మాదాకా వ్యాపించాయి. గుంటూరు-నెల్లూరు స్థానంలో ఓడిపోతే తగిన ప్రాయశ్చిత్తం జరిగిందనుకున్నారు.

అక్కడనుంచి రంగాగారు లండనుకు ఒక పరుగువేశారు. మొదటి రౌండుటేబిల్ సభకు వెళ్ళిన మితవాదులకు వ్యతిరేకంగాను, కాంగ్రెసుకు అనుకూలంగానూ ప్రచారం సాగించారు. ఎన్నికలలో తమకు వచ్చిన మచ్చను కప్పిపుచ్చుకోడానికిప్రయత్నించారు.

ఇంతలో 1934 వచ్చింది. కాంగ్రెసు సోషలిస్టుపార్టీ ఏర్పడింది. దానిలో చేరిన ప్రముఖులలో రంగాగారొకరు. అయేడే మరల ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. కాంగ్రెసు సోషలిస్టుపార్టీ ఎన్నికలలో పాల్గొనరాదని తీర్మానించింది. రంగాగారు మళ్ళీ వెనక్కి ఒక గంతువేశారు. సోషలిస్టుపార్టీనుంచి రాజీనామా పెట్టారు. అసెంబ్లీకి నిలబడ్డారు. తీవ్రవాదులు బలపర్చడంవల్ల కాంగ్రెసు అభ్యర్థి అయి, నెగ్గారు.

★

1937 రాష్ట్రశాసనసభల ఎన్నికలు. అఖిలభారత కిసాన్సభ అధ్యక్షుడు రంగాగారు. కాంగ్రెసు ఎన్నికల ప్రణాళిక ఫైజ్పూర్ మహాసభలో నిర్ణయించబడింది. దానిపై దేశమంతటా జవహర్లాల్ నాయకత్వాన ప్రచారం సాగుతోంది.

రంగాగారు మళ్లీ ఒక కుప్పిగంతువేశారు. కిసాన్సభతో నైతం సంప్రదించకుండానే రైతు ప్రమాణ పత్రమని ఒకటి ప్రకటించారు. రైతునియోజకవర్గాల నుంచి వెళ్ళే కాంగ్రెసు అభ్యర్థులు కొందరిచే దానిపై సంతకం చేయించారు.

దీనిపై కాంగ్రెసు పార్లమెంటరీ బోర్డు అధ్యక్షుడు వల్లభాయిపటేల్ కన్నెర్రచేశారు. రంగాగారు క్షమాపణ చెప్పుకొని ప్రమాణపత్రం ఉపసంహరించుకున్నారు.

★

ఇదంతా ఎందుకు చెప్పాలని వచ్చిందంటే, రంగాగారు ఇవుడు మళ్ళీ కిసాన్ కాంగ్రెస్ ప్రమాణమని ఒకటి ప్రకటించారు— "జాతీయ కాంగ్రెసు, కిసాన్ కాంగ్రెసుల రైతుకూలీ ప్రజారాజ్యం (పూర్ణ స్వరాజ్యం) ఆశయమును అంగీకరించుచు, ఈ ఆశయ సాధనకు వారి సత్య అహింసాత్మక మార్గములన్నింటిని బలపరచుచున్నాను." (జమీన్ రైతునుండి)

ముందువచ్చిన చెవులకంటే వెనుకవచ్చిన కొమ్ములు వాడిఅంటారు. కొత్త బిచ్చగాడు పొద్దెరుగడు. అల్లాగే రంగాగారు "సత్య-అహింసలు" అని తమ ప్రమాణంలో చేర్చి, గాంధీభక్త దనిపించుకోవాలని ప్రయాసపడుతున్నారు. ఈవిషయమై మొన్న 9 వ తేదీ 'ఆంధ్రపత్రిక'లో పడిన అగ్నిశర్మగారివ్యాఖ్య ప్రకటించుతున్నాముగాన నేను వదలివేస్తాను.

జాతీయకాంగ్రెసు ఆశయం పూర్ణ స్వరాజ్యం లేక సంపూర్ణ స్వాతంత్ర్యం. కాంగ్రెసు మహాసభ భారత స్వాతంత్ర్యం కోరే అన్ని వర్గాల ప్రజలసంస్థ. దాని లక్ష్యం ప్రజాస్వామిక సూత్రాలపై ఆధారపడిన సంపూర్ణస్వాతంత్ర్యం. రంగాగారు ఒక్కదెబ్బని 'రైతు-కూలీ' ప్రజారాజ్యనినాదం కాంగ్రెసు అంగీకరించిందని దబ్బావాయించుతున్నారు. తాము సృష్టించిన ప్రమాణపత్రంలో అలాచేర్చారు.

ఇదీ ఎంతోకాలం నిలువదులెండి! రంగాగారు దబ్బావాయించినంత మాత్రాన కాంగ్రెసు ఆశయం మారదు. రేపో-మాపో రంగాగారికి చివాట్లు తప్పవు. రంగాగారు క్షమాపణ చెప్పుకొని ఉపసంహరించుకోక తప్పదు.

రంగాగారుకోరే "రైతుకూలి ప్రజారాజ్యం" స్వరూపం ఏమిటి? సోషలిస్టు ప్రజారాజ్యమైన సోవియటు యూనియన్ను ఆయన యిపుడు సామ్రాజ్యవాద దేశమని ప్రచారం చేస్తున్నాడు. ఒకప్పుడు ఆయనే కార్మిక కర్షక రాజ్యమని పొగడిన దానినే రైతులకు అన్యాయం చేసిందని రంగా నేడు నిందించుతున్నాడు.

నేడు ఎర్రసైన్యం విముక్తిచేసిన దేశాలలో ప్రజాస్వామిక ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి. జమీందారుల, భూస్వాముల భూమి రైతులకు పంచబడుతూంది. బాల్టిక్ రాజ్యాలలో అలాగేచేశారు. పోలెండులో 120 ఎకరాలకు మించివున్న భూస్వాములవద్ద భూమిని లాక్కొన్నారు. రైతులకు కుటుంబానికి 12 ఎకరాల చొప్పున యిచ్చారు.

ఇదంతా రైతులకు క్షేమమేగదా! రంగాగారు ఏగుండెతో యిది రైతులకు లాభకరం కాదనగలరు? భూస్వాముల, జమీందార్ల పక్షంవహించినవారు మాత్రమేఎర్రసైన్యాన్ని, సోవియట్ ఆశయాలను నిందించుతారు.

★

మూరెడు ముందుకు, బారెడు వెనక్కి గంతులు వేసేవారిని లెనిన్ ఫిలిస్టైనని పిలిచాడు. వారినే "Empty Gut full of hope and fear" అన్నాడు.

"కాంగ్రెసు లక్ష్యము": రంగా

*

అయ్యా,

ఫిబ్రవరి రెండోతేదీన శ్రీ యన్. జి. రంగాగారు కిసాన్ కాంగ్రెసు సహచరులను విద్యార్థులలో చేర్పడం మొదలుపెట్టినారని, ఈ దిగువ వ్రాసిన ప్రతిజ్ఞ వారిచేతచేయించినారని పత్రికా ముఖాన తెలుస్తున్నది.

(ప్రతిజ్ఞ కంచుకాగడాలో తెలిపాము.)

ఇంతవరకూ రాజకీయసంస్థ ఏదీ సత్యాహింసలు సాధనోపాయంగా పెట్టుకోలేదు. కాంగ్రెసు కూడా కార్యపరంగా అవలంబించింది. కాని కిసాన్ కాంగ్రెసు అసలు కాంగ్రెసుకన్న ముందుకు పోయి, గాంధీ మహాత్మునిజీవితవ్రతమైన అహింసనూ, సత్యమునూ లక్ష్యసాధనగా పెట్టుకోవడం మహాత్ముడున్నూ, సత్యవ్రతులూ, అహింసాత్ములూ, అయినవారున్నూ, తదభిమానులున్నూ హర్షించదగినదే. రంగారు ఈనాడు యీ వ్రతమే కిసాన్ కాంగ్రెసు ద్వారా చేయించబూనుకొన్నారు. యీ ఉత్తమ లక్షణాలు వ్యవహారయోగ్యం కావని జనబాహుళ్యం అనుకున్నా, ప్రజలు అసలే మరచిపోకుండా ఏ కొద్దిమందైనప్పటికి సాధించేవారు ఉండవలసిందే.

కాంగ్రెసు —అంటే ఇండియన్ నేషనల్ కాంగ్రెసు లక్ష్యం వారు చెప్పింది కాదు.

ఇండియన్ నేషనల్ కాన్స్టిట్యూషన్ ఒకటో విధిలో ఇలా ఉన్నది:

"యధాన్యాయమూ, ప్రశాంత మూ అయిన సాధనోపాయములవలన భారత ప్రజలు పూర్ణ స్వరాజ్యము సాధించుటయే కాంగ్రెసు లక్ష్యము" అని. ఇదీ కాంగ్రెసు లక్ష్యము.

అంతేగాని, సాధనోపాయములు కిసాన్ కాంగ్రెసు సాధనోపాయములవంటివి ఎన్నడూకావు - యధాన్యాయ మనటానికి, సత్యవంతము అనడానికి పెద్దవ్యత్యాసం ఉంది. అలాగే ప్రశాంత మనడానికి, అహింసాత్మక మనడానికి ఎంతైనా వ్యత్యాసం ఉంది.

కాంగ్రెసు ఈ రెండోపద్ధతి అవలంబించవలెనని కాంక్షించవచ్చును. అందుకని పూనుకోనూ వచ్చును. కాని మనస్సుకు హితమైనట్లు ఉన్నదాన్ని ఊరికే మార్చివేయకూడదు. ఆ మధ్య కాశేశ్వరరావు గారున్నూ ఇలాటి భ్రమేపడినారు.

1934 లో కాంగ్రెసు ఒకటోవిధిని ఇలా మార్చడానికి ప్రయత్నించింది. గాంధీజీ విఫలుడైనాడు. ఆయన కాంగ్రెస్లో పావలా సభ్యత్వం వదిలేసి ఆసందర్భంలో రాజకీయాల విరమించుకున్నారు కూడాను.

లేని అపోహలు కలిగించడం పాడిగాదు. నిజంగా న్యాయపద్ధతులంటే సత్యవంతంగా ఉండాలనీ, శాంతిపద్ధతులంటే అహింసాత్మకం అనీ, గాంధీమహాత్ముడుకూడా అన్వయం చెప్పారేగాని మార్చలేకపోయారు.

ఇప్పుడు శ్రీ రంగాగారు కాంగ్రెసు లక్ష్యాన్ని పైకెత్తి కిసాన్ కాంగ్రెసు లక్ష్యంతో లీనం చేయడం భావ్యం కాదు. ప్రజలకి అదివిగోదుగా ఉంటుంది.

కనుక ఈ లేఖాముఖంగా వారికి విన్నవించేదేమంటే అపోహలకు ఎలాటి తావూ లేకుండా దేనిలక్ష్యం దానికి ఉన్నదున్నట్లు పేర్కొనవలసింది అని.

(12 వ పేజీ తరువాయి)

కర్తవ్యం

ఈ ఎత్తుగడలు సాగకుండా ఉండాలంటే, జపానుఫాసిస్టులదురాక్రమణకు ఇకఎన్నడూ అవకాశం లేకుండా ఉండాలంటే, మిత్రరాజ్యాలు ఏకముఖంగా జపాను సేనల్నెదుర్కొని హతమార్చాలి. చైనాలో కమ్యూనిస్టు — కొమింటాంగు ఐక్యత కుదిరి, చైనా జాతీయశక్తులు ఏకముఖంగా శత్రువునెదుర్కోవాలి. ఈసమస్య చైనాలోనే కాకుండా, ఇతరదేశాల్లోని చైనావారికికూడా ఎంతో ఆందోళన కలిగిస్తూంది. ఉత్తర, దక్షిణ అమెరికాల్లోఉన్న పది చైనా పత్రికలవారు ఈ మధ్య చంగ్-కై-షేక్కి ఒకతంతి పంపారు. కొమింటాంగ్ పార్టీ నియంతృత్వాన్నిఖండిస్తూ, అన్నిపక్షాలుకలిసి ఉన్న జాతీయసంయుక్త ప్రభుత్వాన్ని తక్షణం స్థాపించాలని ఈ తంతి కోరింది. వీరి విజ్ఞప్తులు పాటించని కొమింటాంగ్ నియంతృత్వం క్రింద దేశంలో ఏర్పడుతున్న హీనస్థితి ప్రజల్లో తీవ్ర అసంతృప్తి కలిగిస్తూంది. ఈ విధంగా తనపై ముంచుకొస్తున్న ఒత్తిడికి చంగ్-కై-షేక్ లొంగక తప్పడంలేదు. "సంయుక్త ప్రభుత్వవర్గాన్ని స్థాపించడానికి అన్నిపార్టీలు కలిసిఉన్న జాతీయ సమావేశాన్ని వెంటనే ఏర్పాటుచేయాల"ని కమ్యూనిస్టుపార్టీ పెట్టిన డిమాండును అంగీకరించాడు. ఈ సమావేశం జయప్రదమయేలా చైనా ప్రజలు జాగ్రత్తపడాలి. అలా జయప్రదమైననాడే విజయం సాధ్యంకాగలదు. తమ కడగండ్లు తీరగలవు.

బర్మాలో

ఇటు బర్మాలో బ్రిటిషువారు మందగమనంతో యుద్ధాలు సాగిస్తునే ఉన్నారు. యూరపులో పని పూర్తికాగానే అమెరికా వారికి సాయంపంపుతానని చర్చిల్ రూజ్వెల్టుకి వాగ్దానంచేశారట. కాని అసూచనలింతవరకు కానరావు. ఎందువలనంటే, భారతసమస్య పరిష్కారం కానిదే చర్చిల్ తన వాగ్దానం చెల్లించుకోలేడు. ఈసమస్యను పరిష్కరించాలనే ఉద్దేశం ప్రభుత్వానికింకా కలిగినట్లు లేదు. కాని పసిఫిక్ యుద్ధం జయప్రదంగా అంతమవడం మనక్కూడా అవసరం. భారతసమస్య న్యాయంగాపరిష్కారమవడం తమ వాంఛ కూడా అని అమెరికా విదేశాంగ కార్యదర్శి ఈమధ్య ప్రకటించారు. అమెరికాలో కార్మికవర్గం, అభివృద్ధికరవర్గాలు భారతీయులవాంఛను బలపరుస్తున్నట్లు ప్రపంచ ట్రేడ్ యూనియన్ సమావేశంలోపాల్గొన్న అమెరికాప్రతినిధులు ప్రకటించారు. బ్రిటిషు కార్మికవర్గంకూడా తన సానుభూతిని సుస్పష్టం చేసింది. కాని భారతదేశంలో జాతీయైక్యత ఏర్పడనంతవరకు వీరందరిసానుభూతి నిష్ప్రయోజన మవుతుంది. ఆ ఐక్యత కుదిరిననాడు బ్రిటిషు నిరంకుశులు [illegible] లాగాలొంగిరాకతప్పదు. ఆనాడే పసిఫిక్ రంగంలో మిత్రబలాలశక్తి ఇనుమడించి, జపానుఫాసి [illegible]

★ యుద్ధసమీక్ష

తాపీ మోహన్‌రావ్

ముందు గొయ్యి - వెనుక నుయ్యి

జర్మన్ సేనానాయకుల గతి

ప్రోలెండులో మిగిలిపోయిన ఆఖరు పెద్దపట్టణం పోజ్నాన్. పూర్తిగా రెడార్మీ వశమయింది. 23000 జర్మన్ సైనికులు ఖైదీలయారు; 28000 మంది చచ్చారు. ఇంతవరకు పోజ్నాన్ని ముట్టడిస్తున్న సోవియట్ సేనలు, ఇక జర్మనీ నడిగడ్డమీద సాగుతూన్న ప్రచండ యుద్ధాల్లో పాల్గొనగలవు. అక్కడ మార్షల్ కోనీవ్ సేనలు బ్రెస్లోనగరం చుట్టూ చక్రబంధం పూర్తిచేశాయి.

ఇంకా ముందుకు సాగిన సోవియట్ సేనలు గుబెన్ నగర శివారులను చేరుకొన్నాయి. ఇది నీసనదిమీదనున్న ఒక కీలకస్థానం. బెర్లిన్‌కి ఆగ్నేయంగా 65 మైళ్ళ దూరం. ఫ్రాన్‌కఫర్టుకి దక్షిణంగా 30 మైళ్ళలోపు ఉంది.

జర్మన్ యుద్ధశాఖ నాయకులిప్పుడు పెద్ద చిక్కులో పడ్డారు. ఫ్రాన్‌కఫర్టు మీదుగా బెర్లిన్‌పైకి ఉరకడానికి మార్షల్ జుకావ్ మాటేసి కూర్చున్నాడు. అదే ముఖ్యమైన ప్రమాదం అనుకొని ప్రధాన సేనల్ని అరంగంలో ప్రోగుచేశారా - ప్రక్కవాటుగా ముందుకొస్తున్న మార్షల్ కోనీవ్ వాటిని చుట్టుముట్టగలడు. అంతేకాదు. స్టెటిన్‌మీదికి పోతూన్న మార్షల్ జుకావ్ సేనలు ఉత్తరదిశనుంచి ప్రక్కవాటుగావచ్చి పైబడగలవు. లేదా, ఈ ప్రమాదాలను ఎదుర్కోవాలనుకుంటే మార్షల్ జుకావ్ ముందుకురుకుతాడు. ఇది ఇలా ఉండగా దక్షిణాన ఆస్ట్రియామీదికి, ఆపైని దక్షిణ జర్మనీమీదికి ప్రమాదం ముంచుకొస్తూంది.

ప్రతిఘటనకు బలమెక్కడిది?

ఏమీతోచక జర్మన్లు ఎటుపడితే అటు ప్రతిఘటించ జూస్తున్నారు. అటు మార్షల్ కోనీవ్ సేనల్ని, ఇటు జకోస్లోవేకియా రంగంలో డాన్యూబ్‌నదిమీదా జర్మన్లు తీవ్రముగా ప్రతిఘటింపజూచారు. ఈ ప్రతిఘటన నిష్ప్రయోజనం కాకతప్పదు.

కాని, ఈనాడుకూడా శత్రువు ప్రతిఘటింప సాహసిస్తున్నాడంటే ఈధైర్యం, ఈబలం ఎక్కడిది? బ్రిటిష్ కమ్యూనిస్టుపార్టీ పత్రిక "డెయిలీవర్కర్" దీని రహస్యం కొంత బయటపెట్టింది. జనవరిలో సోవియట్ విజృంభణ ప్రారంభమవడానికి ముందు పడమటి రంగంలో 150 శత్రుడివిజన్లు నిలిచి ఉండేవి. కాని ఈనాడు 70 డివిజన్లుమాత్రమే అక్కడున్నాయి. అటునుంచి మరల్చిన సేనల సహాయంతోనే ఇటుజర్మన్లు రెడార్మీని ప్రతిఘటింప జూస్తున్నారు. అంతేకాదు — ఉత్తర ఇటలీనుంచికూడా జర్మన్లుతమసేనల్ని మరలింప జూస్తున్నట్లువదంతులుబయలుదేరుతున్నాయి. ఇటలీలోను, పడమటిరంగంలోను మిత్రసేనల యుద్ధాలుసవ్యంగా సాగుతున్నట్లయితే నాజీలకుసాధ్యమయేదికాదు.అన్నిరంగాల్లోను నాజీలు తమసేనల్ని ఖర్చుచేసుకోవలసివచ్చేది — త్వరలో హతమారిపోయేవారు.

ఈమిలిటరీ అవకాశాలకుతోడు, రాజకీయంగాకూడా నాజీజర్మన్లకినాదొక కొత్త ఆశకలుగుతూన్నట్లుంది. క్రైమియా సమావేశ ఫలితాలు బ్రిటిష్‌పార్లమెంటులోని అభివృద్ధి నిరోధక ముఠాలకు గాభరా పుట్టించాయి. క్రైమియా ఒడంబడిక జయప్రదం గాకుండా చేయడానికి ఈ ముఠాలు రహస్య సమావేశాలు జరిపి కుట్రలుపన్నుతున్నాయి. లండనులోని పోలెండు సామ్రాజ్యవాదముఠా పీరినింకా పురెక్కిస్తూంది. "విచ్ఛిన్నకుల కుట్రలు" అని 'డెయిలీవర్కర్' పత్రిక వీరిని తూర్పారబట్టింది. గ్లస్టర్ బిషప్పు, ఇప్పటి కాంటర్బరీ ఆర్చి బిషప్పువంటి మతాధిపతులు కూడా వీరికి అండగా ఉన్నారు.

ఇది ఇలా ఉండగా విముక్తిపొందిన దేశాల్లోకూడా ఫాసిస్టు అనుకూలురు పరిస్థితులను అల్లకల్లోలంచేయ జూస్తున్నారు. గ్రీసు ఉదంతం చూచాము. ఇప్పుడు రుమేనియారో జనరల్ రాడెస్కు ప్రభుత్వం అచ్చంగా ఫాసిస్టు పోకడలపోతూంది. దేశంలో నిసలయిన ప్రజాస్వామిక వ్యవస్థను సుస్థాపితం చేయాలనే రుమేనియా ప్రజలఏకైక వాంఛను జనరల్ రాడెస్కు తృణీకరించి, ఫాసిస్టులతో రహస్యంగా లాలూచీలు జరుపుతున్నాడు, ఈపరిస్థితుల నంతమొందించడానికి "జాతీయ ప్రజాస్వామ్య సంఘటన" ఆధ్వర్యాన ప్రజలు బ్రహ్మాండమైన ప్రదర్శన జరిపారు. రాడెస్కు వీరిపై తుపాకులు కాల్పించాడు. ఇతని ఫాసిస్టు అనుకూల తత్వాన్ని 'ప్రవ్దా' పత్రిక అదివరకే బయటపెట్టింది.

ప్రజలశక్తి ముందు ఇలాంటి చీడపురుగులు ఎంతోకాలం నిలవరు. కాని, ఇలాంటి వారి ఆసరా చూచుకొనే గోబెల్సు ఈనాడుకూడా. "1948 లో ప్రపంచయుద్ధం తప్పదు. మొట్టమొదట బ్రిటన్‌తోను, ఆ తరువాత అమెరికామీదా సోవియట్ యుద్ధంచేస్తుంది. క్రైమియా ఒడంబడిక జరిగినందుకు అనాడు అందరూ చెంపలు వేసుకుంటారు"ని వాగగలుగుతున్నాడు. క్రైమియా ఒడంబడికను భగ్నంచేయడానికి కుట్రలు జరుగుతున్నాయి. నా మంత్రాన్ని కూడా మరికొంత నూరిపోస్తే ఇక పాచికపారవచ్చు"ని ఈ నీచుని ఆశ. ఈ ముఠాల ఆశలన్నీ అడియాసలు కాక తప్పదు. కాని ఈ కుట్రలను మొగ్గలోనే తుంచినట్లయితే నష్టకష్టాలెన్నో తప్పగలవు. మరింత సునాయాసంగా విజయం లభించగలదు. మిత్రరాజ్యాల ప్రజలిందుకు పూనుకుంటారని ఆశ. పడమట ప్రారంభమయిన కొత్తయుద్ధాలు త్వరలో ప్రచండం కావాలి. ఇటలీలో కూడా పెద్దఎత్తున యుద్ధాలు ప్రారంభం కావాలి.

స్టాలిన్ సందేశం

రెడార్మీ 24 వ జన్మదినోత్సవం (మొన్న 23వ తేది)నాడు కామ్రేడ్ స్టాలిన్ ఇలా ప్రకటించాడు.

"పడమటిరంగంలో గొప్ప దండయాత్ర సాగించి ఆల్సాస్, బెల్జియంలను తిరిగి వశపరచుకోవాలని జర్మన్లు శీతకాలానికి కార్యక్రమం వేసుకున్నారు. శీతాకాలంలోనే మన దండయాత్ర ప్రారంభించాం. దీనితో జర్మన్ల పడమటిరంగ కార్యక్రమం భగ్నమయింది. జర్మన్లపైనే దెబ్బతీయడానికి మిత్రరాజ్య సేనలకు అవకాశం కలిగింది. అవిధంగా తూర్పున దండయాత్రకు, పడమట మిత్రరాజ్యాల యుద్ధాలకు సమన్వయం కుదరగల పరిస్థితులేర్పడ్డాయి. ఇదీ మన శీతకాల దండయాత్ర సాధించిన మొదటి ఫలితం.

"దండయాత్ర ప్రారంభించిన నలభై దినాల్లో (1945 జనవరి, ఫిబ్రవరి మాసాల్లో) రెడార్మీ 300 పట్టణాలనుండి జర్మన్లకు ఉద్వాసం చెప్పింది. టాంకుల్ని, విమానాలను, యితర యుద్ధసామగ్రిని తయారుచేసే వంద ఫ్యాక్టరీలను, 2400 రైల్వే స్టేషన్లను, మొత్తం 9000 మైళ్ళ పొడవుగల రైలు మార్గాన్ని స్వాధీనం చేసుకుంది.

"ఈ కొద్దికాలంలో 3,50,000 మంది జర్మన్ సైనికులు, సైనికోద్యోగులు ఖైదీలుగా పట్టుబడ్డారు, 8,00,000 మంది చచ్చారు. ఇంతేగాకుండా జర్మనీ 3000 విమానాలను, 4500 టాంకుల్ని, 12000 ఫిరంగుల్నికూడా నష్టపోయింది.

"వంద ఏళ్ళుగ శత్రుపురుగు తమ సరిహద్దుదాటి రాలేదనీ, ఎల్లప్పుడూ జర్మన్లే ఇతరదేశాల నాక్రమించి యుద్ధాలుచేశారనీ ఇకమీదటకూడా ఈ సాంప్రదాయాన్నే కొనసాగిస్తామనీ హిట్లరు నాజీలు తండకావరం కొద్దీ మొరిగారు, ఈ నోళ్ళ కిప్పుడు శాశ్వతంగా తాళం పడింది.

"విధివిరామంలేని యుద్ధం ప్రారంభమయి నాలుగేళ్ళయింది. ఈ నాలుగేళ్ళలో రెడార్మీ మునుపటికన్నా బలవత్తరమైంది. మునుపటికన్నా శత్రుదుర్నిరీక్ష్యమైంది. దాని పాకచక్యం అంగబలము ఎంతో పన్నెదేరాయి.

"అయినప్పటికీ విజయం దానంతటదితీ ఉడిపడదు. భయంకర సంగ్రామ భూమిలో నిరంతరకృషి ఫలితంగానే అదిలభించగలదు. మన విజయయాత్రని నరికట్టడానికి కడసారి ప్రయత్నంగా శత్రువు మిగిలివున్న బలాన్నంతటినీ వెచ్చిస్తున్నాడు. పాపఫలితాన్నుండి తప్పించుకోజూస్తున్నాడు. యుద్ధ నిర్వహణలో నీచాతినీచమైన ఎత్తుగడలక్కూడా ఒడిగట్టుతున్నాడు.

"కాబట్టి బహూపరాకు! విజయం చేరువకొస్తున్నకొద్దీ వేయికళ్ళతోకనిపెట్టి జాగ్రత్త పడాలి. వేయిరెట్లు బలమైన దెబ్బలను శత్రువుపై కురిపించాలి."

★

ఈ 27 వ జన్మదినోత్సవ సందర్భంలో మార్షల్సు టిమోషెంకో, వొరొషిలావ్, బుడెన్నీ, జుకావ్, కొనీవ్‌లకు ఉత్తమోత్తమ సోవియట్ బిరుదు పతకం-ఆర్డర్ ఆఫ్ లెనిన్ బహూకరించారు.

పసిఫిక్ యుద్ధంలో నూతనఘట్టం

పసిఫిక్కురంగంలో చాల ముఖ్యమయిన ఘటనలు జరిగాయి. వందలకొలది అమెరికా యుద్ధనావలు జపానుకు చాల సమీపంలోకి వచ్చాయి. అవి మోసుకువచ్చిన 1500 విమానాలు టోకియోపైకి వెళ్ళి అగ్నివర్షం కురిపించాయి. వరుసగా రెండుమూడు రోజులీబాంబుల వర్షం కురిసింది. ప్రధాన పరిశ్రమలు, రైలుమార్గాలు రూపుమాసి పోయాయి. ఈ విమానదాడి జరుగుతూండగానే, టోకియోకి దక్షిణంగా 750 మైళ్ళదూరంలో ఉన్న ఇవోజిమా అనే దీవి (వాల్కెనో దీవుల్లో మధ్యది) మీద అమెరికా సేనలు దిగాయి.

ఈ ఘటనయొక్క ప్రాధాన్యతేమిటి? గువామ్‌లో ఉన్న అమెరికా ప్రధానకార్యాలయానికి, టోకియోకీ మధ్యనుండి ఇవోజిమా. ఈ దీవిలోఉన్న విమానాలకు టోకియో అందుబాటులోఉంటుంది. అంటేఅన్నివిధాలాజపాను నడిగడ్డను మిత్రసేనలు సమీపిస్తున్నాయన్న మాట. మరో విషయం. ప్రపంచంలో నౌకాబలంలో మిన్నఅయిన దేశాల్లో జపానొకటి. అలాంటి జపానుకు ఎంతో సమీపంలోకి మిత్రనావలువచ్చినా, జపానునావలు ఎక్కడా ఎదురుపడలేదు. వేలకొలది విమానాలు టోకియోపై విహారం చేస్తున్నా, ప్రతిఘటన అంతగా లేకపోయిందంటే సముద్రంమీదా, ఆకాశరంగంలోను అమెరికా వారిదే పైచేయి అన్నమాట. ఇవోజిమా యుద్ధంతో పసిఫిక్ రంగంలో నూతన దశ ప్రారంభమయింది. జపాను నడిగడ్డపైకే దండయాత్ర ప్రారంభించగలసమయం దగ్గరపడిందనక తప్పదు.

జపాను ఎత్తుగడ

కాని, పసిఫిక్కు రంగంలో పరిస్థితులు ఇలాంటి దండయాత్రకు అనుకూలంగా ఉన్నాయా? లేవు. జపానును పూర్తిగా ఓడించాలంటే, చైనాలోఉన్న 25లక్షల జపానుసేనను ముందుగా హతమార్చాలి. జపానువారు ఒక్కటొక్కటిగ పసిఫిక్కుదీవుల్ని పోగొట్టుకుంటున్నారు. బర్మాలో ఆత్మరక్షణకోసమే యుద్ధం చేస్తున్నారు. కాని చైనాలోమాత్రం వారి ఉధృతం తగ్గలేదు. కీలకస్థానాలపై లంఘిస్తూనే ఉన్నారు. సముద్రతీరంమీదికి మిత్రసేనలు వస్తే తీవ్రంగా ప్రతిఘటించడానికి రక్షణకోటలు కడుతున్నారట. అంటే, చైనా సేనల్ని విచ్ఛిన్నంచేసి, విజయం సాధించి, చివరకు తమబలా లన్నిటితోను మిత్రరాజ్యాల నెదుర్కోవాలను ఎత్తుగడ మీదనే జపానువారు ఇంకా ఉన్నారన్నమాట. అంతేకాదు — పరిస్థితులు ఇంకా విషమించకముందే మిత్రరాజ్యాలతో ఏదో ఒక సంధి కుదుర్చుకొని, మళ్ళీ అదును కనిపెట్టి తమ దురాక్రమణ కార్యక్రమం కొనసాగించాలని కూడా వారి ఎత్తుగడ. "సంధి సంప్రదింపుల నెవరయినా సూచిస్తే జపాను వాటిని తృణీకరించదు" అని జపాను విదేశాంగమంత్రి చేసిన ప్రకటన అంతరార్థం ఇదే.

(మిగతా 11 వ పేజీలో)

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE